01ATP29F_01ATP29F.qxd 29-04-2026 PM 11:41 Page 1




అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 30 ఏప్రిల్ 2026 పేజీలు : 04


# తాడిపత్రిలో ఏసిబి అధికారులు మెరుపు దాడులు

- రైతు నుంచి లంచం తీసుకుంటున్న విఆర్ఓ రామకృష్ణను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసిబి అధికారులు
- రూ.30 వేల రూపాయలు అవినీతి సొమ్ము స్వాధీనం



మీడియాతో మాట్లాడుతున్న ఏసిబి అధికారులు





పట్టుబడిన విఆర్ఒ రామకృష్ణ , విచారణ చేపడుతున్న దృశ్యం

**తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త**

తాడిపత్రిలో ఏసీబీ అధికారులు మెరుపు దాడులు చేశారు. తాడిపత్రి మండలం ఆవులతిప్పాయపల్లి గ్రామానికి చెందిన రైతు నుంచి విఆర్ఒ 30 వేల రూపాయల నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రైతుకు సంబంధించి పూర్వీకుల నుంచి వచ్చిన భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించుకోవడానికి విఆర్ఒ రామకృష్ణ డబ్బులు డిమాండ్ చేయడంతో రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా వారి సూచనల మేరకు కడప రోడ్డులోని ఐశ్వర్య విల్లాస్ ఎదురుగా ఉన్న దాబాలో విఆర్ఒ రామకృష్ణకు డబ్బులు ఇస్తుండగా ఏసీబీ సిఐ హమీద్‌ఖాన్ ఆధ్వర్యంలో విఆర్ఒను అదుపులోకి తీసుకున్నారు. సామాన్య ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అందినకాడికి దండుకుంటున్న ఓ అవినీతి తిమింగలాన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. భూమి రికార్డులను ఆన్‌లైన్ ఎక్కించేందుకు ఓ రైతు నుంచి లంచం డిమాండ్ చేసిన విఆర్ఒ డబ్బులు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన ఘటన జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ శాఖలో కలకలం రేపుతోంది. తాడిపత్రి మండలంలో అవినీతి నిరోధకశాఖ అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించారు. తాడిపత్రి మండల పరిధిలోని ఆలూరు గ్రామానికి చెందిన విఆర్ఒ రామకృష్ణ ఏసీబీ వలకి చిక్కారు.

కేవలం ఆలూరు మాత్రమే కాకుండా సజ్జలదిన్నె, వెలమకూరు సహా మొత్తం ఐదు గ్రామాలకు ఇన్‌చార్జ్ విఆర్ఒగా బాధ్యతలు నిర్వహిస్తున్న రామకృష్ణ విధుల్లో చేరినప్పటి నుంచీ అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే ఆవులతిప్పాయపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు, సర్వే నెంబర్ 37-బిలో ఉన్న తన 87 సెంట్ల భూమిని ఆన్‌లైన్ మ్యుటేషన్ చేయాలని విఆర్ఓను ఆశ్రయించారు. అయితే ఈ చిన్న పని చేయడానికి విఆర్ఒ రామకృష్ణ ఏకంగా లక్ష రూపాయల లంచం డిమాండ్ చేశారు. బాధితుడు అంత ఇచ్చుకోలేనని బతిమలాడటంతో చివరకు 30 వేల రూపాయలకు ఒప్పందం కుదిరింది. అవినీతి అధికారికి బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్న బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వ్యూహం ప్రకారం తాడిపత్రిలోని ఐశ్వర్య విల్లాస్ ఎదురుగా ఉన్న ఒక టీకేఫ్‌లో బాధితుడి నుంచి 30 వేల రూపాయల నగదు తీసుకుంటుండగా ఏసీబీ సిఐ హమీద్‌ఖాన్ నేతృత్వంలోని బృందం రామకృష్ణను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రస్తుతం తాడిపత్రి తహాశీల్దార్ కార్యాలయంలో విఆర్ఒ రామకృష్ణను ఏసీబీ అధికారులు సుదీర్ఘంగా విచారిస్తున్నారు. ఏసీబీ డిఎస్‌పి ప్రసాద్‌రావు, సిఐ హమీద్‌ఖాన్ ఈ విచారణలో పాల్గొన్నారు. కేవలం విఆర్ఒ ఒక్కరే ఈ అక్రమాలకు పాల్పడుతున్నారా ? లేక దీని వెనుక పై అధికారుల హస్తం వుందా లేదా ఇతర రెవెన్యూ సిబ్బంది పాత్ర ఏమైనా ఉందా ? అనే కోణంలో తహాశీల్దార్ సమక్షంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# మంత్రి సంతకాన్ని ఫోర్జరీ చేసిన కేసులో ఇద్దరు అరెస్టు

- వివరాలను వెల్లడించిన డిఎస్పీ శివనారాయణస్వామి

**కదిరి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త**

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నఖిలీ ఆర్డర్ కాపీ తయారు చేసిన కేసులో ఇద్దరు నింధితులను అరెస్టు చేసినట్లు డిఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. బుధవారం పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అందుకు సంబంధించిన వివరాలను డిఎస్పీ శివనారాయణస్వామి వెల్లడించారు. తనకల్లు మండలం చీకతిమానంపెల్లికి చెందిన జయచంద్రకు కదిరి మండలం కవిలేపల్లికి చెందిన పలక వేణు, పలక గంగాద్రిలు బంధువులు అవుతారని, జయచంద్రభార్య జె.రమణమ్మ కడప రిమ్స్ వైద్య శాలలో స్టాఫ్ నర్సుగా విధులునిర్వహజుస్తూ అక్కడే పీజీ చేస్తోదన్నారు. వారి సొంత గ్రామమైన చీకటి మానెంపల్లికి, తన కుటుంబ సభ్యుల పిల్లల బాగోగులు చూసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మని జయచంద్ర గంగాధర్‌కు తెలపడంతో గంగాద్రి, ఆయన కుమారుడు వేణు సులభంగా డబ్బు సంపాదించాలన్న నెపంతో జయచంద్రకకుక మోసపూరిత మాటలు చెప్పి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వద్ద పిఏ శేషాద్రి తనకు తెలుసునని అతనితో మాట్లాడి కరమణమ్మను కడప నుంచి మదనపల్లి జిజిహెచ్‌కు ట్రాన్స్ ఫర్ చేయిస్తానని రూ.లక్ష తీసుకు న్నారని,



వివరాలను వెల్లడిస్తున్న డిఎస్పీ శివనారాయణస్వామి

చాట్ జిపిటి ఏఐ టూల్‌ను ఉపయోగించి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అసలు సంతకం లాగ డిజిటల్ సంతకం ఉన్న ట్లుగా నకిలీ ఆర్డర్ సృష్టించి ఈ నెల 26-1- 2026వ తేదిన వాట్సాప్ ద్వారా జయచంద్రకు పంపి అసలు ఆర్డర్ కాపీగా నమ్మించి మోసం చేశారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సంతకం ఫోర్జరీ కేసులో తనకల్లు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. నకిలీ ఆర్డర్ ఫోర్జరీ కాపీ కేసు ఛేదించి నేరస్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్పీ తెలిపారు. సమావేశంలో రూరల్ సిఐ నాగేంద్ర, తనకల్లు ఎస్ఐ పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఉచిత కృత్రిమ అవయవాలు పంపిణీ...!

## ధర్మవరంలో మహా సేవాయజ్ఞం చేపట్టిన మంత్రి సత్యకుమార్ యాదవ్...!







కృత్రిమ అవయవాలను పరిశీలిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, లబ్ధిదారులతో మంత్రి

**శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 29,ప్రభాతవార్త**

ధర్మవరం నియోజకవర్గంలోని వికలాంగుల సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్,సంస్కృతి సేవా సమితి సౌజన్యంతో, ప్రపంచ ప్రఖ్యాత భగవాన్ మహావీర్ వికలాంగ సహాయత సమితి హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ధర్మవరం పోతుకుంట ఏరియా ఆసుపత్రిలో బుధవారం నిర్వహించిన ఉచిత కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్, లబ్ధిదారులకు కృత్రిమ కాళ్లు, చేతులు మరియు ఇతర సహాయక పరికరాలను అందజేసి, వారి జీవన విధానంలో నూతన ఆశలు నింపారు. ఒక్కో లబ్ధిదారునితో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటూ, ప్రభుత్వానికి మరియు తనకు ప్రజల పట్ల ఉన్న బాధ్యతను మరోసారి చాటిచెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ, ధర్మవరం ప్రజల సేవ చేయడం నా బాధ్యత మాత్రమే కాదు.. అది నా ధర్మం అని స్పష్టం చేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కోసం నిరంతరం కృషి చేస్తానని, ముఖ్యంగా వికలాంగులు సమాజంలో వెనుకబడిపోకుండా వారికి అవసరమైన సహాయక పరికరాలు, వైద్య సేవలు అందించడంలో ఎలాంటి రాజీ పడబోనని తెలిపారు. వికలాంగులను దివ్యాంగులుగా గౌరవించే భావజాలాన్ని దేశానికి అందించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారి దూరదృష్టిని గుర్తుచేస్తూ, వారికి సమాన గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. భగవాన్ మహావీర్ వికలాంగ సహాయత సమితి దశాబ్దాలుగా ఒక్క పైసా కూడా తీసుకోకుండా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి సేవలు అందిస్తున్న అరుదైన సంస్థగా కొనియాడారు. ఒడిశా నుంచి వచ్చిన వైద్యురాలు డాక్టర్ ప్రియాంక సహా వైద్య బృందం సేవా భావాన్ని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా మొత్తం 212 మంది వికలాంగులకు కృత్రిమ అవయవాల కొలతలు తీసుకుని, వారికి తగిన విధంగా పరికరాలు సిద్ధం చేసి పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఒక్కో పరికరం వెనుక ఉన్న ఖర్చును మంత్రి వివరించుతూ, ఈ కార్యక్రమం ఎంత పెద్ద స్థాయిలో జరుగుతోందో తెలియజేశారు. మా సంస్కృతి సేవా సమితి ద్వారా ధర్మవరం నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని అన్నారు. ఇటీవల ఉచిత కంటి పరీక్షలు, శస్త్రచికిత్సలు శిబిరం ఏర్పాటు చేసి దాని ద్వారా ఇప్పటివరకు 727 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 135 మంది క్యాటరాక్ట్ బాధితులకు విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించబడ్డాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వికలాంగుల సంక్షేమం కోసం పెన్షన్లను భారీగా పెంచారని మంత్రి గుర్తుచేశారు. మంచానికి పరిమితమైన వారికి రూ. 15,000, దివ్యాంగులకు రూ. 6,000 పెన్షన్ ప్రతి నెలా ఒకటో తేదీనే అందేలా చూస్తున్నామని భరోసా ఇచ్చారు. సదరం సర్టిఫికెట్ల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులను తొలగిస్తూ, ధర్మవరం ఏరియా ఆసుపత్రిలోనే ఈ సేవలను ప్రారంభిస్తున్నామని, 21 కొత్త వైకల్యాలను చేర్చినట్లు మంత్రి ప్రకటించారు. మీ కుటుంబ సభ్యుడిగా నేను ఎప్పుడూ మీతోనే ఉంటాను.. మీకు ఏ అవసరం వచ్చినా ప్రభుత్వం, నేను మీకు అండగా నిలుస్తాం అని మంత్రి భరోసా ఇచ్చారు. ప్రతి నెలా, ప్రతి సంవత్సరం ఇలాంటి సేవా కార్యక్రమాలను సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా వికలాంగుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపబడగా, ప్రజలు మంత్రి సత్యకుమార్ యాదవ్ గారి సేవా భావాన్ని కొనియాడుతున్నారు. ధర్మవరం నియోజకవర్గంలో ప్రజా సంక్షేమానికి ఆయన చేస్తున్న కృషి మరోసారి స్పష్టమైంది. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, సంస్కృతి సేవా సమితి ప్రతినిధులు, భగవాన్ మహావీర్ వికలాంగ సహాయత సమితి హైదరాబాద్ శాఖ సిబ్బంది, స్థానిక బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# క్షతగాత్రుల ప్రాణాలు కాపాడుదాం

- జిల్లా ఎస్పీ పి.జగదీష్ పిలుపు



**అనంతపురం క్రైమ్ ఏప్రిల్ 29 ప్రభాతవార్త**

ప్రమాదకర స్థితిలో ఉన్న క్షతగాత్రుల ప్రాణాలను కాపాడుదామని అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాద క్షతగాత్రుల ఆసుపత్రిలో చేరిక, ఉచిత నగదు రహిత చికిత్స పథకం ద్వారా రోడ్డు ప్రమాద బాధితులకు అత్యవసర వైద్య సేవలు కాష్‌లెస్ విధానంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ పథకం కింద రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తికి గరిష్టంగా రూ.1.5 లక్షల వరకు, ప్రమాదం జరిగిన తేదీ నుండి 7 రోజుల పాటు గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో ఉచితంగా క్యాష్ లెస్ చికిత్స అందించబడుతుందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ముఖ్యమైన "గోల్డెన్ అవర్" సమయంలో నగదు చెల్లింపు లేకుండా చికిత్స పొందేలా ఈ పథకం ప్రత్యేకంగా రూపొందించబడిందన్నారు. ప్రాణాలను కాపాడే గోల్డెన్ అవర్ రోడ్డు ప్రమాదం జరిగిన మొదటి 60 నిమిషాలు అత్యంత కీలకం. ఈ సమయంలో వెంటనే స్పందించి, 112 కి కాల్ చేస్తే అంబులెన్స్ సేవలు తక్షణం అందుబాటులోకి వస్తాయన్నారు. ఉచితంగా తక్షణ వైద్య చికిత్స ప్రమాద బాధితులను సమీప ఆసుపత్రిలో ఎలాంటి ఆలస్యం లేకుండా చేర్చి చికిత్స ప్రారంభిస్తారు. ఒక్కో బాధితుడికి గరిష్టంగా రూ.1.5 లక్షల వరకు క్యాష్‌లెస్ చికిత్స 7 రోజులపాటు అందించబడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ అర్హులే డ్రైవర్లు, ప్రయాణికులు, పాదచారులు, సైకిల్ దారులు ఎవరైనా రోడ్డు ప్రమాదంలో గాయపడితే ఈ పథకం వర్తిస్తుందని, విదేశీయులు కూడా అర్హులేనన్నారు. బాధితుడికి ఎటువంటి ఖర్చు లేదు చికిత్స ఖర్చు ప్రభుత్వం/భీమా నిధుల ద్వారా ఆసుపత్రులకు నేరుగా చెల్లించబడుతుందన్నారు. బాధితులు లేదా వారి కుటుంబ సభ్యులు డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ప్రమాదం జరిగిన 24 గంటల తర్వాత ఆసుపత్రిలో చేరినవారు అర్హులు కారన్నారు. ఈ పథకం అమలులో భాగంగా ‚దీతిళి, గిలీళీ వంటి డిజిటల్ వ్యవస్థల ద్వారా పోలీసు శాఖ కు రిక్వెస్ట్ అందిన 24 గంట్లలో పోలీసులతో సమన్వయం ద్వారా ప్రమాద ధృవీకరణ, ఆసుపత్రులు ఇతర శాఖల మధ్య సమన్వయం ఏర్పాటు చేయబడుతుందన్నారు. ప్రమాద సమాచారం నమోదు, బాధితుడి వివరాలు, చికిత్స ప్రక్రియలు అన్నీ సమగ్రంగా పర్యవేక్షించబడతాయన్నారు. సహాయం చేసే వారికి రక్షణ బహుమతి ప్రమాద బాధితులను ఆసుపత్రికి తీసుకెళ్లే "గుడ్ సమారిటన్ లకు చట్టపరమైన రక్షణతో పాటు రూ.25,000 వరకు బహుమతి కూడా అందించబడుతుందన్నారు. సహాయం చేసిన వారికి ఎటువంటి పోలీస్ ఇబ్బందులు ఉండవన్నారు. ప్రజలకు విజ్ఞప్తి...మీ ఒక్క అడుగు ఒక ప్రాణాన్ని కాపాడగలదు...జిల్లా స్థాయిలో పోలీస్ శాఖ, జిల్లా పరిపాలన, ఆరోగ్య శాఖల సమన్వయంతో ఈ పథకం సమర్థవంతంగా అమలు చేయబడుతోంది. అందువల్ల ప్రజలు రోడ్డు ప్రమాదం గమనించినప్పుడు భయపడకుండా వెంటనే డయల్ 112 కు సమాచారం అందించి క్షతగాత్రులను సమీపలోని నెట్వర్క్ ఆసుపత్రికి తరలించడంలో సహకరించాలన్నారు. ఈ పథకం ద్వారా లభించే ఉచిత చికిత్స సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు.

# బీసీలకు పెద్ద పీట వేసింది టీడీపీనే : ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

- ఏటా రూ.15 వేల కోట్లు కేటాయించిన ఘనత చంద్రబాబుదే : ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి
- 102 ప్రాజెక్టులను ఆపేసింది వైసీపీనే : పరిటాల శ్రీరామ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు రాజు, పల్లె సింధూర రెడ్డి, ధర్మవరం ఇన్చార్జి పరిటాల శ్రీరామ్

**అంతపురం క్రైమ్ ఏప్రిల్ 29 ప్రభాతవార్త**

బీసీలకు అన్ని విధాల అభివృద్ధి చేసే పెద్దపీట వేసింది టిడిపి ప్రభుత్వమేనని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు స్పష్టం చేశారు. బుధవారం రోడ్డు భవనాల అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ధర్మవరం ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ తో కలిసి మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది టీడీపీనేనన్నారు. పార్టీ పరంగా, అధికారికంగా అయినా బీసీలకు పెద్ద పీట వేసింది టీడీపీనన్నారు. అధికారంలో ఉండగా వైసీపీ నాయకులను పూర్తిగా విస్మరించారని ఇప్పుడు రాయలసీమపై ప్రేమ ఉన్నట్టుగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. అనంతపురంలో జరిగిన సమావేశంలో 15నిమిషాలు కూడా జనం లేరు. అందులో పుట్టపర్తిలోని ఇళ్లనే రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సరైన అనుమతులు డీపీఆర్ లు లేకుండా ప్రారంభించారన్నారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం కేసులు వేస్త 2021లోనే ఆగిపోయిందన్నారన్నారు. దీనిపై సరైన కౌంటర్ కూడా వేయలేదన్నారు. కానీ కూటమి ప్రభుత్వంలో ఆగిపోయినట్టు ప్రచారం చేస్తున్నారన్నారు. గత ఐదేళ్లలో ప్రాజెక్టుల కోసం ఎంత ఖర్చు చేశారని ప్రశ్నించారు. హంద్రీనీవా ప్రాజెక్టు కోసం ఎంత ఖర్చు చేశారన్నారు. దీనిపై చర్చించడానికి ఎక్కడైనా సిద్ధమన్నారు. పోలవరం నుంచి హంద్రీనీవా వరకు ఏ ప్రాజెక్టు గురించి చర్చించడానికైనా సిద్ధమన్నారు. ఇది వైసీపీ కొత్త నాటకమన్నారు. రేవంత్ రెడ్డి మాట్లాడిన దానికి వివరణ ఇచ్చారన్నారు. ఏపీ ఉమ్మడి ఆస్తులపై ఎవరికి తెలియకుండా వెళ్లి సంతకాలు పెట్టి వచ్చాడన్నారు. ఇవన్నీ ఎవరి తెలియవని కుంటే మీ పొరుబాటే నన్నారు. వైసీపీ హయాంలోనే ఒకే సమాజిక వర్గానికే పదవులు ఇచ్చారన్నారు. ధర్మవరం ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి మాట్లాడటానికి వైసీపీకి కనీస అర్హత లేదు. రాయలసీమ గురించి మాట్లాడే అర్హత అంతకన్నా లేదు. 356జీఓ రాష్ట్ర వ్యాప్తంగా 102ప్రాజెక్టులను అర్ధాంతరంగా ఆపేసింది వైసీపీనన్నారు. ఇద్దరు సీఎంలు మాట్లాడారని, ఈ రోజు యాగీ చేస్తున్నారు. అప్పుడు 102ప్రాజెక్టుల గురించి మాట్లాడి ఉంటే.. మీకు విలువ ఉండేదన్నారు. ఇప్పుడు చంద్రబాబు మీద బురద జల్లాలని చూస్తున్నారు. పేరూరు, బీటీపీ, జిల్లేడుబండ ప్రాజెక్టులను ఆపేశారనన్నారు. టీడీపీ హయాంలో గ్రావిటీతోనే చాలా చెరువులకు నీరిచ్చాం. మీ ఐదేళ్ల పాలనలో కనీసం వాటిని పట్టించుకోకుండా బద్ధకించారు. మీరు ఇలానే వ్యవహరిస్తే ప్రజలు, రైతులు పరిగెత్తించి కొడుతారన్నారు. రాయలసీమకు దిశ దశను ముఖ్యమంత్రి చంద్రబాబు మార్చబోతున్నారన్నారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్ గా మార్చబోతున్నారన్నారు. ఎన్నికల ముందు 5లక్షల ఎకరాలకు నీరు ఇస్తామని జగన్ హామీ ఇచ్చాడన్నారు. 5 లక్షల ఎకరాల పక్కన పెడితే.. ఒక్క ఎకరాకు నీరు ఇవ్వలేదన్నారు. హంద్రీనీవా ద్వారా ఎన్ని ఎకరాలకు, చెరువులకు నీరందుతుందో చూసుకోండన్నారు. రాత్రికి రాత్రే ఏదీ సాధ్యం కాదని, చంద్రబాబు అన్నీ ప్రాధాన్యత వారిగా చేస్తున్నారన్నారు. రాయలసీమ కోసం, రైతుల కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు అడుగులు పడుతున్నాయన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఏ ప్రాజెక్టును కూడా వైసీపీ పట్టించుకోలేదన్నారు. కనీసం నిర్వహణ, మరమ్మతులు కూడా సరిగా చేయలేక నష్టం చేకూర్చారని ఆరోపించారు. ఏ ప్రాజెక్టు అయినా ప్రారంభించింది ఎన్టీఆరే నని, అయితే పూర్తి చేసింది చంద్రబాబు మాత్రమేనన్నారు. ప్రతి బడ్జెట్ లో 14 నుంచి 15వేల కోట్లు చంద్రబాబు కేటాయించారన్నారు. ఈ రెండేళ్లలో 8వేల కోట్లు కేటాయించారన్నారు. పోలవరం ప్రాజెక్ట్ ను పూర్తి చేస్తామని మూడు సార్లు వాయిదా వేశారన్నారు. పోలవరం ప్రాజెక్టును వేగవంతం చేస్తూ కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చారన్నారు. టీడీపీ హయాంలోనే 2,700 కోట్లు కేంద్రం నుంచి పరిహారం కోసం తీసుకొచ్చారన్నారు. కృష్ణజలాల మాకు వద్దని లేఖ రాసింది ఎవరికో తెలుసనన్నారు. పట్టిసీమ కడితే కృష్ణ, గోదావరి ప్రాంతాల వారిని రెచ్చగొట్టింది జగనేనన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు మరమ్మతు చేయకపోవడం వలన ఎంతో మంది చనిపోయారన్నారు. రాయలసీమ ప్రాజెక్టు వారి హయాంలోనే ఆగిపోతే ఇప్పుడు మాట్లాడుతున్నారన్నారు.

# గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు నిందితులు అరెస్ట్

- 10 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న దృశ్యం



నిందితులను చూపుతున్న ఏఎస్పి

**తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలోని నందలపాడు రైల్వే స్టేషన్ సమీపంలో ఒరిస్సా నుంచి గంజాయి తీసుకొచ్చి పట్టణంలో సరఫరా చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి పేర్కొన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒరిస్సాకు చెందిన బలరాంస్వైన్, ఆకాష్‌నహేష్‌లు రైలులో తాడిపత్రి పట్టణానికి గంజాయి సరఫరా చేసేవారు. పోలీసుల తనిఖీలు చేపట్టగా వారి వద్ద నుంచి 10 కిలోల 55 గ్రాముల గంజాయితో పాటు 8 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకరు మైనర్ కావడంతో జువైల్ హోమ్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. తాడిపత్రిలో ఎక్కడైనా గంజాయి తదితర మాదక ద్రవ్యాలు ఎవరైనా విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచి యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చూసేందుకు అవకాశం ఉంటుందని వారు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ సిఐ ఆరోహణరావు, ఎస్ఐ దయాకర్, ఏఎస్ఐ హనుమంతు, కానిస్టేబుల్ గోవిందు, తదితరులు పాల్గొన్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న కానిస్టేబుల్ గోవిందరాజులుకు ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి రివార్డు అందజేశారు.

ధర్మవరంలో ఘనంగా శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి రథోత్సవం. 4>>

## నిర్ణీత గడువు లోపు పనులు పూర్తి చేయండి

- కాంట్రాక్టర్లతో కమిషనర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కమిషనర్ మల్లికార్జున

హిందూపురం ఏప్రిల్ 29 ప్రభాతవార్త

హిందూపురం మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పథకాల కింద జరుగుతున్న కాంట్రాక్ట్ పనులను నిర్ణీత వ్యవధిలోపు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్పష్టం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం కింద మంజూరైన నిధులు రూ. 2.5 కోట్ల నిధులకు గాను 1 కోటి 30 లక్షల రూపాయల సంబంధించి అభివృద్ధి పనులు పెండింగ్ ఉన్నాయని వీటిని వెంటనే ప్రారంభించాలని కమిషనర్ సూచించారు. త్రీ గ్రాంట్స్ రూ. 1.17 కోట్లు లో 80 శాతం పూర్తి కాగా మిగిలిన పనులు మే 15 లోపు పూర్తిచేయాలి చెప్పారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూ. 2 కోట్లు రాగా 16 పనులు కు గాను 4 స్టార్ట్ అయ్యాయి. 8 టెండర్ స్టేజిలో ఉండి వర్క్ ఆర్డర్ త్వరలోనే ఇస్తామని చెప్పారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రాధనిస్తే మోహిస్తున్న హిందూపురంలో అభివృద్ధి పనులు నాణ్యతతో చేస్తూ శరవేగంగా కేటాయించిన గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు కమిషనర్ దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో మున్సిపల్ డిఇలు, ఏఇలు పాల్గొన్నారు.

## కల్తీ కల్లు విక్రయిస్తే పీడీ యాక్ట్

ఎక్సైజ్ సిఐ లక్ష్మీ దుర్గయ్య



సూచనలు ఇస్తున్న సీఐ లక్ష్మీదుర్గయ్య

హిందూపురం ఏప్రిల్ 29 ప్రభాతవార్త

స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని హిందూపురం, పరిగి, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో ఉన్న కల్లు దుకాణాల లైసెన్స్ దారులతో బుధవారం హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ నందు సమావేశం ఏర్పాటు చేశారు. సీఐ లక్ష్మీ దుర్గయ్య నేతృత్వంలో జరిగిన సమావేశంలో పలు కీలక సూచనలు ఇచ్చారు. ప్రతి ఒక్క లైసెన్స్ దారుడు వారికి కేటాయించిన చెక్ బంది నందు కల్లు విక్రయాలు జరుపవలెనని, కల్తీ కల్లు కలిగి ఉన్నచో వారి మీద కేసులు నమోదు చేసి, పీడీ యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే దుకాణాల నందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎటువంటి నేరాలు జరగకుండా చూసుకోవలసిన బాధ్యత సదరు లైసెన్స్ దారుడి మీద ఉన్నదని, అలాగే లైసెన్సు పరిసరాల నందు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎటువంటి హానికర రసాయనాలు కలపకుండా ప్రజలకు సహకరించాలని తెలిపారు. లైసెన్స్ లేని వ్యక్తులు కల్లు అమ్మిన, కలిగి ఉన్నా, రవాణా చేసిన వారి మీద కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.

## లయన్స్ క్లబ్ సౌజన్యంతో అన్నా క్యాంటీన్ భోజనం



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్ ఏప్రిల్ 29 ప్రభాతవార్త

లయన్స్ క్లబ్ ఆర్థిక సౌజన్యంతో స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న అన్నా క్యాంటీన్లో బుధవారం భోజన వసతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున హాజరయ్యారు. దాదాపు 700 మందికి అన్న క్యాంటీన్లో ఉచితంగా లయన్స్ క్లబ్ భోజనం అందించింది. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, సత్యనారాయణ మొదలగువారు పాల్గొన్నారు.

## విలేకరిని హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి



తహసిల్దార్‌కు వినతి అందిస్తున్న దృశ్యం

అమరాపురం ఏప్రిల్ 29 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయం నందు మండల విలేకరుల సంఘం తరఫున విలేఖరి జగన్మోహన్ రెడ్డిని హత్య చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని తహసిల్దార్ లక్ష్మీనరసింహం కువినతి సమర్పించారు. అమరాపురం పాత్రికేయులు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా వి కోట విలేఖరి జగన్మోహన్ రెడ్డిని హత్య చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని అమరాపురం జర్నలిజం యూనియన్ నాయకులు తెలియజేశారు. పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు కోరారు. జర్నలిస్టులు సమాజంలో జరుగుతున్న ప్రతి విషయాన్ని బయటకు తెలియజేయడంలో ముందు ఉంటారని వారు తెలిపారు. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజలకు చేరవేయడమే సమాజంలో జరిగే అవినీతి అక్రమాలు ఎత్తిచూపడంలో అత్యంత కీలక పాత్ర పోషించేది జర్నలిస్టులేనని అలాంటి వారి పైన దాడి చేయడం హేయమైన చర్యని పేర్కొన్నారు. విలేకరులపై హత్యలు దాడులు చేయడం సాధారణమైపోయిందని ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని, విలేకరుల పట్ల రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విలేకర్ల సంఘం అధ్యక్షుడు తిమ్మప్ప, విలేకరులు, తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరాలపై పోలీసులు

రొళ్ల ఏప్రిల్ 30( ప్రభాతవార్త)

మండలంలో పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. బుధవారం రాబడిన సమాచారం మేరకు ఎస్ఐ నరసింహుడు వారి సిబ్బందితో కలిసి మండలంలోని రంగనపల్లి గ్రామ శివర్లో పేకాట స్థావరం పై సంయుక్తంగా దాడి చేసి పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులో తీసుకున్నారు. అనంతరం వారి వద్ద నుంచి రూ .8,200 నగదు స్వాధీన చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. జూదం ఆడేవారు ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. పేకాట స్థావరాల పై దాడులు నిత్యం కొనసాగుతాయని ఎస్ఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్ళు మధు, షఫీ పాల్గొన్నారు.

## జొన్న,మొక్కజొన్న, వేరుశెనగకు మద్దతు ధర ప్రకటించాలి

- రైతులకు మద్దతుగా ఆర్డిఓ ఆఫీస్ ముందు ఉషాశ్రీ చరణ్ ధర్నా



ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా దృశ్యం

పెనుకొండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

రైతుల పండించే జొన్న, మొక్కజొన్న, వేరుశనగ పంటలకు సరైనధరలేక పెట్టుబడి కూడా తిరిగి అందక పోవడంతో రైతు కథ కన్నీటి వెత గా మిగిలిందని శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షురాలు మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. బుధవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం నందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి జొన్న రైతులు, మొక్కజొన్న రైతులు, వేరుశెనగ రైతులకు మద్దతు ధర కల్పించాలని, అలాగే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ర్యాలీ నిర్వహించి, బైఠించి ధర్నా చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా పండించిన



వినతి పత్రం అందజేస్తున్న మాజీమంత్రి ఉషశ్రీచరణ్

పంటలకు సరైన గిట్టుబాటు ధరలు కల్పించి, రైతు పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సబ్ కలెక్టర్ కి రైతులు, వైసీపీ శ్రేణులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ నాడు జగన్ మోహన్ రెడ్డి రైతులకు, కౌలు రైతులకు ఇన్పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సురెన్స్, ధర స్థిరీకరణ, గిట్టుబాటుధర, పంట కొనుగోలు, రైతుభరోసా అందజేస్తే ఈ చంద్రబాబు రైతులకు కనీసం యూరియా కూడా అందించలేకపోతున్నారు అని తెలిపారు. ఎం ఎస్ పి మద్దతుధర రూ. 2,400 ఉన్నపటికీ ప్రభుత్వం కొనడం లేదన్నారు. దళారులు రూ. 1600కే, కొంటున్నారని, ఈ కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవటంతో దళారుల చేతుల్లో రైతులు క్వింటాల్‌కు రూ. 600 నుండి 700 వరకు నష్టపోతున్నారన్నారు. గిట్టుబాటు ధర దక్కక ఒక్కో రైతు లక్షలో నష్టపోతున్నారు, రైతు సమస్యలపై కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పొగాకు రామచంద్ర, మండల కన్వీనర్లు పుప్పం సుధాకర్ రెడ్డి, గజేంద్ర, పెనుకొండ పట్టణ కన్వీనర్ నరసింహులు, మండల వైస్ కన్వీనర్ కురుబవాండ్లపల్లి చెన్నకేసులు, మాజీ మండల కన్వీనర్ లు నాగలూరు బాబు, శ్రీకాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ సి నారాయణరెడ్డి, వైసిపి శ్రేణులు కురుబవాండ్లపల్లి ఆంజనేయులు, పూజారప్ప, బొగ్గ నరసింహులు ఒంటికొండ ఈశ్వరప్ప, నరసింహులు, కొండంపల్లి గోపాల్ రెడ్డి, సమరసింహారెడ్డి, శ్రీరామ్ రెడ్డి, మరువపల్లి నారాయణ, వెంకటేశులు, రాంపురం చిన్న ఆంజనేయులు, మునిమడుగు శేఖర్, కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్యానికి ముప్పు

జర్నలిస్టు జగన్మోహన్ రెడ్డి హత్యను ఖండించిన ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు..




ఏపీయూడబ్ల్యూజే యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై లావణ్య కు వినతి పత్రాన్ని అందజేస్తున్న జర్నలిస్టులు

మడకశిర టౌన్ ఏప్రిల్ 29 ప్రభాతవార్త

చిత్తూరు జిల్లా వి.కొత్తకోటలో జర్నలిస్ట్ జగన్మోహన్‌రెడ్డిని హత్యచేసిన గంధం స్మగ్లర్లు, రౌడీ షీటర్ మహబూబ్బాషాని ఎన్కౌంటర్ చేయాలని మడకశిర ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు, పాత్రికేయులు ర్యాలీగా వెళ్లి స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ లావణ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఏపీయూడబ్ల్యూజె యూనియన్ నాయకులు మాట్లాడుతూ మీడియాపై జరుగుతున్న దాడులను కఠినంగా అణచివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలను తుంచివేసే ప్రయత్నమని, మీడియా స్వేచ్ఛను అణచివేయాలనే దురుద్దేశ్యంతో జరుగుతున్నాయని విమర్శించారు. సమాజంలో నాల్గవ స్థంభంగా పిలవబడే జర్నలిస్టును అత్యంత కిరాతకంగా దుండగులు హత్య చేయడాన్ని ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. జర్నలిస్టు జగన్మోహన్ రెడ్డి హత్యకు పాల్పడిన దుండగులను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని వారు కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షులు కాపు రామాంజనేయులు, ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు పాత్రికేయులు పాల్గొన్నారు.

## గ్రామ పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత

ఎంపీడీవో దివాకర్



స్వచ్ఛ పథం,రథం కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారులు.

అనంతపురం రూరల్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

అనంతపురం రూరల్ మండలం కందుకూరు, ఆకుతోటపల్లి గ్రామాలన్ని పరిశుభ్రంగా ఉంచడం గ్రామ ప్రజలందరికీ బాధ్యతని ఎంపీడీవో దివాకర్, పంచాయతీ అభివృద్ధి అధికారి మల్లికార్జున తెలిపారు. బుధవారం రెండు గ్రామ పంచాయతీలలో స్వచ్ఛ పథం,స్వచ్ఛరథంకార్యక్రమాన్ని పంచాయతీ అభివృద్ధి అధికారిమల్లికార్జుననిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో దివాకర్ హాజరై పంచాయతీ కార్మికులు గ్రామాలలో చేపడుతున్న స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల శుభ్రత ప్రజలందరూ బాధ్యతగా తీసుకొని చెత్తను గ్రామంలో ఎక్కడపడితే అక్కడ వేయకుండా గ్రామంలోని పంచాయతీ కార్మికులు ఇంటి వద్దకు వచ్చినప్పుడు వారికి తడి పొడి చెత్తను వేరువేరుగా అందించి గ్రామాన్ని పరిశుభ్ర గ్రామంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా శుభ్రమైన గ్రామం, ఆరోగ్యమైన కుటుంబం కోసం గ్రామానికి స్వచ్ఛ రథం వచ్చినప్పుడు ప్లాస్టిక్ వస్తువులు, కాగితాలు, లోహపు గాజులు అందించి స్వచ్ఛ రథం నుంచి ఇంటిలోకి కావలసిన నిత్యవసర సరుకులు పొందాలన్నారు. అనంతరం రెండు గ్రామాల రహదారిలో గల చెత్తను పంచాయతీ కార్మికులతో శుభ్రం చేయించి వాటిని చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రానికి తరలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నంది వాహనంపై పార్వతి సంగమేశ్వర స్వామి విహారం

నేడు రాత్రి 7 గంటలకు కళ్యాణోత్సవం

కొత్తచెరువు ఏప్రిల్ 29 ప్రభాతవార్త



నంది వాహనంపై పార్వతీ సంగమేశ్వరులు విహారం చేస్తున్న దృశ్యం

శ్రీ సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు లో భాగంగా బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో ప్రత్యేకంగా అలంకరించబడిన నంది వాహనంపై శ్రీ పార్వతి సంగమేశ్వర స్వామి ఉత్సవ మూర్తుల విగ్రహాలు ఉంచి పుర వీధుల గుండా ఊరేగించడం జరిగింది ఈ సందర్భంగా గ్రామ ప్రజలు స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టారు అనంతరం పురోహితులు సాయినాథ్ స్వామి భక్తాదుల కు తీర్థప్రసాదాలు అందజేశారు గురువారం సాయంత్రం ఏడు గంటలకు శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయంలో శ్రీ లక్ష్మీ ప్రసన్న పార్వతి సంగమేశ్వరులు కళ్యాణోత్సవం కనుల పండుగగా నిర్వహించబడునని ఆలయ కమిటీ నిర్వాహికులు తెలిపారు భక్తాదులు పెద్ద ఎత్తున కళ్యాణోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## విలేఖరి హత్య కేసులో హంతకులను కఠినంగా శిక్షించాలి



తహసీల్దార్ స్వర్ణలతకు వినతి పత్రం అందజేస్తున్న పాత్రికేయులు

బత్తలపల్లి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

చిత్తూరు జిల్లా వి.కోటకు చెందిన విలేకరి జగన్మోహన్రెడ్డిని దారుణంగా హత్యచేసిన దుండగులను కఠినంగాశిక్షించాలని బత్తలపల్లి మండల పాత్రికేయులు డిమాండ్ చేశారు. బుధవారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్లు బత్తలపల్లి కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి మదనాపు రామాంజనేయులు, డివిజన్ ప్రధాన కార్యదర్శి జాంపుల అజయ్ చౌదరి మాట్లాడుతూ విలేకర్లపై ఇటీవల కాలంలో దాడులు పెరిగిపోతున్నాయన్నారు. దాడులే కాకుండా ఇప్పుడు హత్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వం దీన్ని తీవ్రంగా పరిగణించి జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేకంగా చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ స్వర్ణలత, ఎస్ఐ సోమశేఖర్ కు వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పాత్రికేయులు మదనాపు శ్రీనివాసులు, మంజుల రాధాకృష్ణ. కప్పల హరికృష్ణ, మదనాపు కృపాకర్, సాకే శ్రీనివాసులు, వెంకటచౌదరి. సాకే వన్నూరప్ప, మాతంగి రామాంజనేయులు, అన్వేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కమతం కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి రహిత సమాజం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి

తాడిమర్రి ఏప్రిల్ 29 (ప్రభాతవార్త)



క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హరి

మండల కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు టిబి ముక్త్ భారత్ లో భాగంగా 2030 నాటికి క్షయ వ్యాధి రహిత సమాజం కోసం కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాల నిర్ణయాల మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొబైల్ హ్యాండిల్ డిజిటల్ ఎక్స్ రే వైద్య శిబిరాలను డాక్టర్ హరిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ హరిత మాట్లాడుతూ క్షయ వ్యాధి పై అవగాహన కల్పించి, క్షయవ్యాధి సోకే అవకాశం ఉన్నవారి ని మొబైల్ హ్యాండిల్ డిజిటల్ ఎక్స్ రే ద్వారా గుర్తించినట్లయితే వ్యాధిని ప్రారంభ దశలోనే పూర్తి గా నిర్మూలించవచ్చు అని డాక్టర్ హరిత అన్నారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్ రే ద్వారా 102 మందికి ఎక్స్‌రే తీశామన్నారు. ఇందులో క్షయ వ్యాధి నిర్ధారణ అయిన రోగులకు ఉచితంగా ఆరు నెలల పాటు మందులు మరియు పోషకాహారం ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పి హెచ్ ఎన్ లక్ష్మీ దేవి, సూపర్వైజర్ రామ్ కుమార్, ఆరోగ్య కార్యకర్తలు జానకి రామ్, హర్షవర్ధన్, ఎమ్ ఎల్ పి హెచ్ ఎస్ ధరణీ భాయ్, పావని, ఏఎన్ఎం కోమల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు..

## "దిశ"యాప్‌పై అవగాహన

- లేపాక్షిలో పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం
- ఎస్ఐ నరేంద్ర, తహశీల్దార్ సౌజన్యలక్ష్మి పిలుపు



మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

లేపాక్షి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

మహిళలు, బాలికల భద్రత పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఆపద సమయాల్లో పోలీసుల సేవలను వినియోగించుకోవాలని లేపాక్షి ఎస్ఐ నరేంద్ర, తహశీల్దార్ సౌజన్యలక్ష్మి పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలో మహిళలు, బాలబాలికల రక్షణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మహిళలు, చిన్నారులపై పెరుగుతున్న నేరాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు. "భయం వీడండి.. ఫిర్యాదు చేయండ", ఎవరైనా వేధింపులకు గురైతే భయపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులు కోరారు. ముఖ్యంగా..అత్యవసర సమయాల్లో డయల్ 100, షీ టీమ్స్ సేవలను ఉపయోగించుకోవాలి. సెల్‌ఫోన్లలో "దిశ"యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఆపదలో ఉన్నప్పుడు బటన్ నొక్కితే నిమిషాల్లోనే పోలీసులు చేరుకుంటారన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ చిరంజీవి మాట్లాడుతూ మహిళల రక్షణ కేవలం పోలీసుల బాధ్యతే కాదని, కుటుంబం మరియు సమాజం కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. చట్టాల పట్ల అవగాహనతోనే నేరరహిత సమాజం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు, మహిళలు పాల్గొని అధికారుల సూచనలను అడిగి తెలుసుకున్నారు.

## నారాలోకేష్‌ను కలుసుకున్న సామకోటి



నారా లోకేష్ తో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సామకోటి ఆదినారాయణ

పుట్టపర్తి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను పుట్టపర్తి నియోజకవర్గం కు చెందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సామకోటి ఆది నారాయణ ప్రత్యేకంగా కలుసుకున్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నారా లోకేష్ నూతన కార్యవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందన్నారు. నారా లోకేష్ తనతో మాట్లాడుతూ కష్టపడి పని చేస్తే తగిన గుర్తింపు లభిస్తుందనీ, ప్రతి ఒక్కరు పార్టీకి కష్టపడి పని చేయాలని, పార్టీ కార్యక్రమాలు, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నారా లోకేష్ బాబు సూచించారన్నారు. అలాగే సామకోటి ఆదినారాయణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా తనకు నారా లోకేష్ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందన్నారు.

## భక్తుల సౌకర్యార్థం మజ్జిగ పంపిణీ కేంద్రాలు

- పాల్గొన్న పరిటాల శ్రీరామ్ చేనేత ప్రముఖులు సంధా రాఘవ...!



మజ్జిగ పంపిణీ చేస్తున్న పరిటాల శ్రీరామ్,సంధా రాఘవ

ధర్మవరం,ఏప్రిల్ 29,ప్రభాతవార్త

ధర్మవరంలో బుధవారం జరిగిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి రథోత్సవంలో భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాట్లు చేయడంతో పాటు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యాలు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు నిర్వహించినట్టు ధర్మవరం చేనేత ప్రముఖులు సంధా రాఘవ తెలిపారు. పట్టణంలో పలు స్వచ్ఛంద సంస్థలు మంచినీటి కేంద్రాలు, ప్రసాద కేంద్రాలు, ఆహార కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని వారితోపాటు తమ వంతు మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని చేనేత ప్రముఖులు సంధా రాఘవ తెలిపారు. ధర్మవరం పట్టణంలో బుధవారం జరిగిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవంలో ధర్మవరం చుట్టుపక్కల ప్రాంతాల నుండే కాకుండా ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుండి భక్తులు ధర్మవరం చేరుకుని స్వామివారి రథోత్సవం తిలకించారని, ఈ రథోత్సవంలో పాల్గొన్న భక్తులకి సంధా రాఘవ టీం సభ్యులు మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ధర్మవరం టిడిపి ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ ధర్మవరం చేనేత ప్రముఖులు సంధా రాఘవ తో పాటు స్థానిక టిడిపి నాయకులు కమతం కాటమయ్య, జింక పురుషోత్తం , హరి, సురేష్, చంద్ర మోళి, నర్సి, సాయి, మరియు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి : సాకే రామతీర్థ



సమావేశంలో వివిధ సమస్యలు పరిష్కరించుకుందామని ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం.

అనంతపురం రూరల్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని యం ఎస్ ఎస్ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు సాకే రామతీర్థం, జిల్లా అధ్యక్షుడు మన్నల సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఉపాధ్యాయ భవనము లో స్థానిక సమస్యలపై జిల్లా అధ్యక్షులు మన్నల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఎం ఎస్ ఎస్ ఎస్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాదిగ సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సాకే రామతీర్థ హాజరైయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వపాఠశాలలో నాణ్యమైన విద్యఅవసరము, తల్లి దీవెన అమ్మఒడి కాకుండ విలువైన విద్యను తమపిల్లలకు అందించాలన్నారు. స్థానిక ఉపాధ్యాయులను కోరాలన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ స్కూలు విద్య మోజుతో మీ స్థాయికి మించి పిల్లవాళ్ళకు బరువుఎత్తకండి అన్నారు మీరు ఫీజులు కట్టలేని పరిస్థితుల్లో పిల్లలు ఆత్మహత్యలు ప్రైవేట్ కార్పొరేట్, కాలేజీలలోజరుగుతున్నాయి అన్నారు ప్రభుత్వ విద్య విధానాన్ని ప్రోత్సహిద్దాం అన్నారు నేడు వైద్యం పేద ప్రజలకు అందని ద్రాక్ష మదిరిగ తయారైనది ఒకవైపు ఆరోగ్య శ్రీ ని ప్రభుత్వం ప్రైవేటురంగాన్నిప్రోత్సహిస్తున దని అన్నారు ప్రభుత్వ వైద్యశాలలో అన్నిసదుపాయాలు కల్పించాలని తగిన సిబ్బంది పరికరాలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా స్త్రీల విషయంలో అభివృద్ధికి చెందిన దేశాలలో సిజరిన్ వ్యతిరేకిస్తే మన దేశంలో ప్రతి రాష్ట్రంలో నూసిజరిన్, ఫ్యాషన్ అయినది ఈ వ్యాపారాన్ని పూర్తిగ వ్యతిరేకిస్తున్నాం అన్నారు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ వైద్యశాలలో తగిన సిబ్బందినిపరికరాలును వెంటనే ఏర్పాటు చేసి సామాన్య ప్రజల మన్నలను పొందాలన్నారు వ్యవసాయ రంగంలో సమూల మార్పులు తీసుకొచ్చి రైతుల దళారి వ్యవస్థ రద్దుపరిచి రైతులు గిట్టుబాటుధరలను ప్రోత్సహించాలన్నారు నిరుద్యోగులకు ప్రభుత్వం సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలన్నారు ప్రతి ఏటా బ్లాక్ లాక్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు మాదిగలకు ఆలయ ప్రవేశాలు కల్పించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు మాదిగల స్మశాన వాటికల సమస్యలు తీర్చాలన్నారుఈకార్యక్రమంలో మన్నల సుబ్రమణ్యం జిల్లా అధ్యక్షులు, ఎక్కలూరి నాగరాజు ఉపాధ్యక్షులు, ఓబయ్య సంయుక్త కార్యదర్శి, శంకరయ్యకోశాధికారి, మల్లికార్జునతాడిపత్రి, నెట్టెప్ప గుంతకల్, మాలింగ ఉరవకొండ, ప్రవీణ్ కుమార్ కళ్యాణ్ దుర్గం, మల్లేష్ రాయదుర్గం వివిధ మండల గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మే 1 నుంచి ప్రారంభం కానున్న జనగణన 2027

- జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి(కలెక్టరేట్), ఏప్రిల్ 29, ప్రభాతవార్త



శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా మే 1వ తేదీ నుంచి జనగణన2027 తొలి దశ పనులు ప్రారంభం కానున్నాయని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు చార్జ్ ఆఫీసర్లకు ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం లేకుండా షెడ్యూల్ ప్రకారం మే 1 నుంచే క్షేత్రస్థాయి పనులు మొదలు పెట్టాలన్నారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ పూర్తి చేసి, వారికి కేటాయించిన బ్లాకులపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటినీ భౌతికంగా సందర్శించి, కచ్చితమైన సమాచారాన్ని సేకరించాలనీ, డేటా గోప్యతను పాటించాలనీ, రోజువారీ పురోగతిపై నివేదికలు సమర్పించాలన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించి జనగణన ప్రక్రియను విజయవంతం చేయాలనీ ఆదేశించారు.

# ప్రతిఒక్కరూ అభివృద్ధిలో బాగస్వాములు కావాలి

## - ఎంపీడీఓ తేజోష్ణ

పామిడి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త


చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

పరిశుభ్రత, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ బాగస్వాములు కావాలని ఎంపీడీఓ తేజోష్ణ పిలుపునిచ్చా రు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛ పథం కార్యక్రమంలో బాగంగా బుధవారం పన్నానది పరివాహక ప్రాంతం కల్లూరు రోడ్డు నుండా మేజర్ పంచాయతీ కార్యాలయం వరకూ రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తకుప్పలను ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. గృహాల వద్దే తడిచెత్త పొడిచెత్తను వేరు చేసి అందించటం ద్వార కలిగే ప్రయోజనాలపై ప్రజలకు వివరిస్తూ సేకరించిన పొడిచెత్తను స్వచ్ఛరథంకు అప్పగించి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అనుగుణంగా నిత్యవసర సరుకులను పొందాలని కోరారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ అశ్వర్థమ నాయుడు, జూని యర్ అసిస్టెంట్ ఖాజామొయి నుద్దీన్, మేజర్ పంచాయతీ, సచివాలయాల సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కార్పొరేషన్ ఈడీగా సుబ్రహ్మణ్యం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త


ఈడికి పుష్పగుచ్చం అందజేస్తున్న దృశ్యం

ఉమ్మడి అనంతపురం జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీగా సుబ్రహ్మణ్యం బుధవారం బాధ్య తలు స్వీకరించారు. ఆయ న గతంలో ఇక్కడే ఈడీగా పనిచే స్తూ గతి ఏడాది ఆగస్టులో పదవీ విరమణ పొందారు. అయితే ఆయన ఇతర ఉద్యోగులు మాదిరిగా తనకు కూడా రెండేళ్ల సర్వీస్ పొడిగించాలని కోర్టును ఆశ్రయించడం జరిగింది. అలా రెండు నెలల పాటు పనిచేశారు. ఆ తర్వాత ఆయన్ను రిలీవ్ చేయడం జరిగింది. అప్పుడు ఈడీ (ఎఫ్ఎసి) బాధ్యతలను ఉమ్మడి జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.రామసుబ్బారెడ్డికు అప్పగిస్తూ అప్పటి కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. అయినా కూడా సుబ్రహ్మణ్యం తనకు రెండేళ్ల సర్వీస్ పొడిగిస్తూ ఇచ్చిన కోర్టు ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో మళ్లీ కోర్టు కు వెళ్లడం జరిగింది. తాజాగా ఆయన్ను ఈడీగా ఉద్యోగంలో రెండేళ్లు కొనసాగించాలని కోర్టు తీర్పు ఇస్తూ ప్రభుత్వాన్ని ఆదేశించడం జరిగింది. దీంతో ప్రభుత్వం జిల్లా కలెక్టర్‌ను కలవాలని ఆదేశాలు జారి చేసింది. ఆయన జిల్లా కలెక్టర్‌ను కలవడంతో ఈడిగా కొనసాగడానికి అనుమతి ఇవ్వడం జరిగింది. దీంతో ఆయన బాధ్య తలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయం ఉద్యోగులు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈడీకి వచ్చే ఏడాది ఆగస్టు నాటికి 62 ఏళ్ల సర్వీస్ పూర్తి అవుతుంది. అప్పుడు పదవీ విరమణ పొందనున్నారు.

# వెంకటయ్యస్వామి దేవస్తానంలో ఘనంగా భాగవత సత్తాహ కార్యక్రమం


భాగవత సత్తాహ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నిర్వాహకులు, భక్తులు


వెంకటయ్యస్వామి దేవస్థానం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

అనంతపురం శివారులోని చెరువు కట్టపై ఉన్న భగవాన్ వెంకటయ్య స్వామి దేవస్థానంలో ఆలయ కమిటీ సభ్యుల సహకారంతో నార్పల తిక్కయ్యస్వామి భాగవత సత్తసమాజం వారు శ్రీభాగవత సత్తాహకార్యక్రమాన్ని నిర్వహి స్తున్నారు. గత మూడు రోజులుగా పలువురు భక్తులు నిర్వాహకులు భాగవత సత్తాహ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. మరో మూడు రోజులు ఈ కార్యక్రమాన్ని కొనసాగిం చనున్నారు. భక్తి శ్రద్దలతో భాగవత సత్తాహ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. బుధవారం జరిగిన భాగవత సత్తాహ కార్యక్రమంలో తీగల శ్రీనివాసరెడ్డి, బోగాతి బాలగంగమ్మ, ఏడావులపర్తి జి.రామకృష్ణరెడ్డి, కేశవరెడ్డి, ఆర్.పెద్దమల్లారెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, కె.కుళ్లాయిరెడ్డి, కె.చంద్రలీల తదితరులు పాల్గొన్నారు.

# మే 2న అనంతకు డా.పరకాల ప్రభాకర్‌రాక

## - ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి వికేంద్రీ కరణ చర్చా వేదిక ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం

అనంతపురం, ఏప్రిల్ 29 ప్రభాతవార్త బ్యూరో


పకరాల ప్రభాకర్

ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి వికేంద్రీకరణ చర్చా వేదిక ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాల పనితీరుపై కీలక చర్చలు నిర్వహిస్తున్నారు. మే 2వ తేదిన ఉదయం 10 గటల నుంచి సాయంత్రం 4గంటల వరకు అనం తపురంలోని 3వ రోడ్డులోగల గొంగటి రామప్ప కాంపౌండ్‌లో జిఆర్ మినీ ఫంక్షన్ హాల్‌లో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమావేశంలో అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ వై.పురుషోత్తం రెడ్డి, ఆర్థిక విశ్లేషకులు ప్రొ.శ్రీ రామచ ంద్రయ్య, మానవతా రక్తదాతల సంస్థ కన్వీనర్ తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, మానవ హక్కుల వేదిక రాష్ట్రనాయకులు ఎస్.ఎం. బాషా, ప్రముఖ ఆర్థిక వేత్త డా.పరకాల ప్రభాకర్ తదితరులు పాల్గొంటున్నారు. ఈ చర్చా వేదికలకు సంబంధించి ఇతర వివరాల కోసం కె.సలీమ్ మాలిక్(9393723881) నెంబర్‌లో సంప్రదించవచ్చు.

# మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

## - డిఎస్‌పి శ్రీనివాసులు

యల్లనూరు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త


మహిళలకు అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి


. హాజరైన మహిళలు

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని డిఎస్‌పి శ్రీనివాసులు పేర్కొన్నారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ పాఠశాల లో మహిళలు, బాలబాలికల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అనంతపురం రూరల్ డిఎస్‌పి శ్రీనివాసులు, ఎస్‌సి, ఎస్‌టి డిఎస్‌పి మహబూబ్‌బాషా, తహశీల్దార్ రాము హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఎస్‌పిలు మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో అగ్ర స్థానం సాధించాలన్నారు. మహిళల రక్షణకు బాలల రక్షణకు జిల్లా పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యతను కల్పిస్తోందన్నారు. వారికి ఏ సమస్య వచ్చిన నేరుగా పోలీసు అధికారులను సంప్రదించవచ్చన్నారు. ఆపద సమయంలో పోలీసుల సహాయం రక్షణ పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి యాప్‌ను ప్రతి ఒక్కరు తమ మొబైల్‌లో నిక్షిప్తం చేసుకోవాలని వారు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సిఐ సత్యబాబు, ఎస్ఐ రామాంజనేయరెడ్డి, ఎంఇఒ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# కొడిమి జర్నలిస్ట్ కాలనీలో మే 1ఒకటో తేదీ నుంచి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం

## - 10 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల వరకు పాల్గొనవచ్చు - ప్రతిభను గుర్తించేందుకే శిక్షణా శిబిరం

## - ఏపీ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ట్రస్ట్ చైర్మన్, ఎపియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి


మచ్చా రామలింగారెడ్డి



శిక్షణకు సిద్ధమైన క్రికెట్ గ్రౌండ్

అనంతపురం, ఏప్రిల్ 29 ప్రభాతవార్త బ్యూరో

ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లను గుర్తించి ప్రోత్స హించాలన్న లక్ష్యంతో అనంతపురం రూరల్ మండలంలోని కొడిమి గ్రామం కొడిమి జర్నలిస్ట్ కాలనీలో మచ్చా క్రికెట్ అకాడమీ నందు ఈనెల ఏప్రిల్ 26వ తేదీ నుంచి జిల్లాలోని క్రికెట్ నేర్చుకోవాలని క్రికెట్‌లో ఉన్నత స్థానాలకు వెళ్లాలని ఆసక్తి ఉన్న చిన్నారులు జర్నలిస్టుల పిల్లలకు బాలురకు, మహిళా క్రికెట్ పై ఆసక్తి ఉన్న చిన్నారులకు ప్రత్యేక వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి, ఏపీ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ట్రస్ట్ చైర్మన్ తెలిపారు. అటువంటిది జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 10సంవత్సరాల నుంచి 25 సంవత్సరాలలోపు ఉన్న యువకులందరూ ఈ ఉచిత క్రికెట్ శిక్షణలో పాల్గొనవచ్చునని అందరూ ఉపయోగించుకోవాలని మచ్చా రామలింగారెడ్డి కోరారు. వర్కింగ్ జర్నలిస్టు పిల్లలందరూ ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా, చిన్న పత్రికలు, సబ్ ఎడిటర్ల పిల్లలు యూట్యూబ్ ఛానల్స్ పిల్లలు ఇతర మీడియాకు సంబంధించిన వారందరూ ఈ ఉచిత శిక్షణలో పాల్గొనవచ్చునని మచ్చా రామలింగారెడ్డి అన్నారు. క్రికెట్‌కు అవసరమైన క్రికెట్ సామాగ్రి క్రీడాకారులకు ఏపీ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఉచితంగా ఇస్తుందని మచ్చా రామలింగారెడ్డి తెలిపారు. క్రికెట్ నేర్చుకోవాలని ఆసక్తి ఉన్న బాల బాలికలు ఈనెల 30వ తేదీ సాయం త్రంలోపు కొడిమి జర్నలిస్టు కాలనీలో క్రికెట్ అకాడమీలో నేరుగా వారి పేర్లను నమోదు చేసుకోవచ్చని ఆధార్ కార్డు ఉంటే చాలని మచ్చా తెలిపారు. ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం అనంతరం క్రికెటర్లకు సర్టిఫికెట్లు ప్రధానం చేయడం జరుగుతుందని మచ్చా రామలింగారెడ్డి అన్నారు. సీనియర్ క్రికెటర్లతో క్రికెట్ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తామని శిక్షణను ఇవ్వడానికి సీనియర్ క్రికెటర్లను ఎంపిక చేయడం జరిగిందని మచ్చా రామలింగారెడ్డి వివరించారు. క్రికెట్ నేర్చుకోవాలని ఆసక్తి గలవారు ఆధార్ కార్డు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి, ఈనెల 22 తారీకులోపు జిల్లా కార్యదర్శి కె.విజయరాజుకి కొడిమి జర్నలిస్ట్ కాలనీలో అప్లికేషన్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు మచ్చా రామలింగారెడ్డి సెల్ నెంబర్ 9490062555 సంప్రదించాలని తెలిపారు.

# విలేకరిని హత్యచేసినవారిని కఠినంగా శిక్షించాలి

అనంతపురం, ఏప్రిల్ 29 ప్రభాతవార్త బ్యూరో



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు జాఫర్

ఆంధ్రజ్యోతి రిపోర్టర్ వారణాసి జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యను సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఆల్ ఇండియా తంజీం ఏ ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.జాఫర్ పత్రికా ముఖంగా తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్లసమావేశంలో వారు మాట్లాడుతూ.. చిత్తూరు జిల్లా వి.కోట మండల ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డిని అతి దారుణంగా హత్య చేసిన తమీమ్ ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉదయం పట్టణంలోని హై స్కూల్ గ్రౌండ్‌లో రిపోర్టర్ సుబ్రహ్మణ్యంతో కలిసి వాకింగ్ చేస్తుండగా నరికి చంపడమే కాకుండా భయభ్రాంతులను చేసి కేకలు వేస్తూ బైక్ పైన వెళ్లిపోయాడు. తమీమ్‌కు భయంకరమైన నేర చరిత్ర ఉంది. తిరుపతి జిల్లాలో 30 ఎర్రచందనం కేసులు ఉన్నాయి. రౌడీ షీట్ ఓపెన్ చేశారు. ముస్లిం పెద్దలు మసీదు నుండి వెలివేశారు. ఈ ఘటన అనంతరం ఊరి బహిష్కరణ చేశారు. అయినా అక్ష రమే ఆయుధంగా పనిచేస్తున్న పత్రికా విలేకరిని పట్ట పగలు చూసు ఒడగా హత్య చేసి పారిపోయిన తమీమ్ వెనక ఎవరున్నారు. కారణాలు ఏమిటి వీటన్నింటి పైన సమగ్ర దర్యాప్తు జరపవలసి ఉంది. రాష్ట్రస్థాయి పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేక చట్టాలను అమలుపరిచి సత్వరమే చర్యలు తీసుకొన వలసిందిగా విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిందిగా కమ్యూనిస్టు పార్టీ సిపిఐగా డిమాండ్ చేస్తున్నామన్నారు.

# మనాలి అడ్వెంచర్ క్యాంప్‌లో పీవీకేకేఐటీ విద్యార్థిని ఆశ్రిత ప్రతిభ

అనంతపురం, ఏప్రిల్ 29 ప్రభాతవార్త బ్యూరో


విద్యార్థినిని అభినందిస్తున్న పివికెకె కళాశాల ప్రతినిధులు

హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని మనాలి అటల్ బిహారీ వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మోంటెనీరింగ్ అండ్ అలైడ్ స్పోర్ట్స్ నిర్వహించిన జాతీయ స్థాయి అడ్వెంచర్ క్యాంప్‌లో పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఎన్‌సీసీ కెడెట్ సుబ్బర ఆశ్రిత విశిష్ట ప్రతిభ కనబరిచింది. ఏప్రిల్ 17 నుంచి 26 వరకు జరిగిన ఈ శిక్షణలో పివికెకే ఐటిలో బీటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థిని అయిన ఆశ్రిత రాక్ క్లైంబింగ్, రాపెల్లింగ్, రివర్ క్రాసింగ్‌తో పాటు సుమారు 75 కిలోమీటర్ల మేర సాగించిన ట్రెక్కింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసి అత్యుత్తమ ఎ గ్రేడ్‌ను సాధించింది. కళాశాల విదిది అధికారిణి స్వాతి పర్యవేక్షణలో శిక్షణ పొందిన ఆశ్రిత సాహస క్రీడల్లోనే కాకుండా నాయకత్వ లక్షణాల్లోనూ ప్రావీణ్యం కనబరిచి కళాశాల కీర్తిని జాతీయ స్థాయిలో చాటింది.

ఈ సంద ర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ పల్లె కిషోర్, ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రమేష్ బాబు, హెచ్ అండ్ ఎస్ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మినరసప్ప ఆశ్రితను అభినందిస్తూ, ఇలాంటి విజయాలు తోటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

# .ప్రిన్సిపాల్ డా.కెసి.సత్యలత క్రమశిక్షణకు మారుపేరు

## - తరగతి గదుల నిర్మాణానికి ఎంతో కృషి - నేడు పదవీ విరమణ

అనంతపురం, ఏప్రిల్ 29 ప్రభాతవార్త బ్యూరో


ప్రిన్సిపాల్ డా.కెసి.సత్యలత

ఆమె క్రమశిక్షణకు మారుపేరు కాశాల అభ్యున్నతే ఆమే ధ్యేయం విద్యార్థుల భవితవ్యమే ఆమె లక్ష్యం నిరంతరం తన పదవిలో విద్యార్థుల భవితవ్యం కోసం ఎంతో కృషి చేసిన డా.కెసి.సత్యలత ప్రిన్సిపాల్‌గా గురువారం పదవీ విరమణ పొందుతున్నారు. వివిధ కళాశాలల్లో అధ్యాపకురాలిగా, ప్రిన్సిపాల్‌గా పనిచేసి ప్రస్తుతం అనంతపురం కెఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చెందుతున్నారు. కెఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చెందుతున్న నేపథ్యంలో ఆమె చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ ప్రాంతాల్లో ఎక్కడెక్కడ పని చేసిందన్నది ప్రభాతవార్త ప్రత్యేక వార్త కథనాన్ని మీ ముం దు ఉంచుతోంది.

డా.కెసి.సత్యలత మొట్టమొదటి సారిగా 1990 సంవ త్సరం లో ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకురాలుగా ఉద్యో గ జీవితాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత 1999లో పదోన్నతిపై అనంత పురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ అధ్యాపకురాలిగా వచ్చారు. తదనం తరం ఆరేళ్లపాటు ఉన్నత విద్యాశాఖలో కీలక బాధ్యతలను నిర్వర్తించి 2020 సంవత్సరంలో మొట్టమొదటి సారిగా రామచంద్రాపురం డిగ్రీ కళాశా ల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2024 సంవత్సరం అక్టోబర్ నెల లో అనంతపురం కెఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టి కళాశాల అభ్యున్నతికి, విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొం దించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆరోజునుంచి నేటి వరకు కళాశాల అభివృద్ధికి వివిధ అభివృద్ధి కార్యక్రమాలు ప్రిన్సిపాల్ డా.కెసి.సత్యలత చేపట్టి విద్యార్థుల మన్ననలు పొందారు. కెఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వసతి గృహంలో అసంపూర్తిగా ఉన్న గదుల నిర్మాణానికి ప్రిన్సిపాల్ చొరవ తీసుకుంది. కళాశాలకు ఎంఎఫ్‌టి ఫండ్స్‌ను తీసుకొచ్చి వసతి గృహం గదులను పూర్తిచేయ డంతో పాటు అదనంగా నాలుగు తరగతి గదులను నిర్మించడం విశేషం. అదే విధంగా నగర పాలక సంస్థ సహకారంతో కళాశాలలో విద్యార్థులకు మంచి నీటి సౌకర్యం కల్పించే విషయం లో కూడా చొరవ తీసుకున్నారు. కళాశాలలో చదివేమహిళా విద్యార్థుల భద్రత కోసం ప్రహరీ గోడకు కంచెనుకూడా ఏర్పాటు చేశారు. ఈ విధంగా నాటి నుంచి నేటి వరకు ప్రిన్సిపాల్ డా.కెసి. సత్యలత ఎన్నో కార్యక్రమాలను చేపట్టి ఇతరు లకు మార్గదర్శకంగా నిలిచారని చెప్పవచ్చు. ఇదిలా ఉండగా అనంతపునం కెఎస్ఎన్. మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కెసి.సత్యలత పదవీ విరమణ సందర్భంగా గురువారం సాయంత్రం ఆ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. డా.కె.సి. సత్యలతను ఘనంగా సత్కరించనున్నారు.

# జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని ఏఎస్‌పికి తాడిపత్రి విలేకరుల వినతి

## - విలేకరి జగన్‌మోహన్‌రెడ్డి హత్యను ముక్తకంఠంతో ఖండించిన జర్నలిస్టులు

## - నిందితులను కఠినంగా శిక్షించి, కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త


ఏఎస్‌పికి వినతిపత్రం అందచేస్తున్న విలేకరులు

జర్నలిస్టులపై దాడులు, హత్యలు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని తాడిపత్రి జర్నలిస్టులు డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా వి.కోటకు చెందిన రిపోర్టర్ జగన్‌మోహన్‌రెడ్డిని అతి కిరాతకంగా నరికి చంపిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ బుధవారం ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరిని స్థానిక విలేకరులు కలిసి వినతిపత్రం అందజేశారు. రిపోర్టర్ జగన్‌మోహన్‌రెడ్డి వాకింగ్‌కు వెళ్లిన సమయంలో దుండగులు అత్యంత పాశవికంగా నరికి చంపడం బాధాకరమన్నారు. ఈ దారుణ హత్య జర్నలిస్ట్ లోకాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ప్రజాస్వామ్యం నిలబడాలంటే స్వేచ్ఛాయుతమైన జర్నలిజం అవసరమన్నారు. కలాన్ని నమ్ముకున్న వారిపై దాడులు, హత్యలు చేయడం అత్యంత బాధాకరమన్నారు. ఇది కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు, నాలుగో స్తంభంపై, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని ఆవేదన వ్యక్తం చేశారు. రిపోర్టర్ జగన్‌మోహన్‌రెడ్డిని హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, జర్నలిస్టులపై దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చట్టాలు తీసుకురావాలని, హత్యకు గురైన రిపోర్టర్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉండి ఆర్థికంగా ఆదుకోవాలని, జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిపోర్టర్ జగన్‌మోహన్‌రెడ్డి హత్య ఘటనను ముక్తకంఠంతో తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ వెంటనే స్పందించి నిందితులపై చర్యలు తీసుకోవాలని వారు ఏఎస్‌పిని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, నాగరాజు, కన్నా, దిలీప్, రామచంద్ర, స్వామి, ప్రసాద్, రమణ, గిరి, ఈశ్వర్, మధు, కృష్ణారావు, రాంమోహన్, సంజీవ, తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఎంపి అంబికా లక్ష్మినారాయణకు రుణపడి ఉంటాం

పుట్లూరు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త


మృతదేహం వద్ద రోధిస్తున్న దృశ్యం

అనంతపురం ఎంపి అంబికా లక్ష్మినారాయణకు రుణపడి వుంటామని పుట్లూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పెండేల పవన్‌కుమార్ కుటుంబసభ్యులు పేర్కొన్నారు. పెండేల పవన్‌కుమార్ గుజరాత్ రాష్ట్రంలో సూరత్‌కు సమీపంలోని అంకలేశ్వర్‌లోని పీపీ శవాణి యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అయితే గత మూడు రోజుల క్రితం పవన్‌కుమార్ కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ గరికపాటి సుదర్శన్‌నాయుడు ద్వారా అనంతపురం ఎంపి అంబికా లక్ష్మినారాయణకు ఫోను ద్వారా సంప్రదించంగా వెంటనే ఆయన సూరత్ ఎంపితో మాట్లాడి అక్కడ నందలాల్ తమ వద్దకు పంపి తమకు అన్ని సదుపాయలు కల్పించి, అన్ని ఖర్చులు కాలేజీ వాళ్లే భరించే విధంగా మాట్లాడి అంబులెన్స్ ద్వారా మృతదేహాన్ని తమ గ్రామానికి చేర్చడంతో పాటు అక్కడికి వెళ్లిన వారిని ఎంపి అంబికా లక్ష్మినారాయణ ఫ్లైట్ ద్వారా పంపే ఏర్పాటు చేశారన్నారు. బుధవారం పవన్‌కుమార్ అంత్యక్రియలను తమ స్వగ్రామంలో నిర్వహించారు. తమ బాధలను పంచుకుంటూ తమ కుటుంబానికి అండగా నిలిచిన ఎంపి అంబికా లక్ష్మినారాయణకు రుణపడి ఉంటామని వారు పేర్కొన్నారు.

# విలేకరిని దారుణంగా హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి

తనకల్లు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త


డిప్యూటీ తహాశీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న మండల విలేకరులు

చిత్తూరు జిల్లా వీకోట మండల ఆంధ్రజ్యోతి విలేకరి జగన్‌మోహన్‌రెడ్డిని హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల విలేకరులు డిప్యూటీ తహాశీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. విలేకరిని దుండగులు నరికి హత్య చేయడాన్ని తనకల్లు మండల విలేకరులు ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలేకరిపై దౌర్జన్యం చేసి నరకడం చాలా బాధాకరమన్నారు. విలేకరులు ప్రతి ఒక్క నాయకుడి ప్రోగ్రాంకు వచ్చి న్యూస్ కవర్ చేస్తారని, ఉన్నది ఉన్నట్లు రాసినందుకు ఇలాంటి ఘోరాలు జరగడం చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విలేకరిని హత్య చేసిన వారిని అదుపులోకి తీసుకొని వారికి ఉరిశిక్ష విధించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వం విలేకరులకు భద్రత కల్పించాలని వారు కోరారు.

# వివాహ వేడుకకు హాజరైన బొమ్మనశ్రీ రామ్ రెడ్డి

శింగనమల ఏప్రిల్ 29 ప్రభాతవార్త


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న బొమ్మన శ్రీరామ్ రెడ్డి

మండల పరిధిలోని ఈస్ట్ నరసాపురం గ్రామానికి చెందిన బి. రజియా బేగం ఆహ్వానం మేరకు బుధవా రం బుక్కరాయ సముద్రం మండల కేంద్రంలో ఫంక్షన్ హాల్ లో జరిగిన ఆజాద్ వలి. ఆయెషాల. వివాహానికి హాజరై నూతన వధూవరును ఆశీర్వది ంచిన రాష్ట్ర రైతు విభాగం జనరల్ సెక్రటరీ శ్రీ బొమ్మన శ్రీరాం రెడ్డి ఆయన వెంట వైఎస్ఆర్సీపి నేతలు శివపురం తిరుపతయ్య. రమణారెడ్డి. ఈస్ట్ నరసాపురం మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి. అమర. తదితరులు పాల్గొన్నారు.

# చామలూరు రాజగోపాల్ వివాహవేడుకలో పాల్గొన్న తరిమెల వంశీ గోకుల్ రెడ్డి

శింగనమల ఏప్రిల్ 29 ప్రభాతవార్త

మండల పరిధిలోని కల్లుమడి గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు సాకే కొండయ్య కుమార్తె హేమలత మరియు మహేష్ ల వివాహ వేడుకకు రాష్ట్ర వైఎస్సా ర్సీపీ రైతు విభాగం కార్యదర్శి తరిమెల వంశీగోకుల్ రెడ్డి. చామలూరు రాజ గోపాల్ హాజరయ్యారు. కళ్యాణ మండపానికి చేరుకున్న వారికి సాకే కొం దయ్య, కుటుంబ సభ్యులు సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భం గా వారు నూతన వధూవరులను అక్షింతలు వేసి నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో వర్థిల్లాలని ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ కలహాలతో ఐదు నెలల గర్భిణీ ఆత్మహత్య

## - భర్త, కుటుంబసభ్యుల వేధింపులే కారణమని ఆరోపణ


ఆత్మహత్య చేసుకున్న గంగాభవాని


గంగా భవాని (ఫైల్ ఫోటో)

తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లికాలనీలో నివసిస్తున్న సాయి గంగాభవాని (18) అనే ఐదు నెలల గర్భవతి ఇంటిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. సాయి గంగాభవాని ఏడు నెలల క్రితం మంగళ గంగాధర్ అనే వ్యక్తిని ప్రేమించి పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. మూడు రోజులు క్రితం భార్యా భర్తలు ఇద్దరు ఘర్షణ పడ్డారు. దీంతో సాయి గంగాభవాని మనస్థాపంతో డిప్రెషన్‌లోనికి వెళ్లి ఇంటిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సాయి గంగా భవాని తల్లిదండ్రులు అత్తవారింటి వేధింపులు తట్టుకోలేక మా కూతురు చనిపోయిందని ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# వైభవంగా లక్ష్మీనరసింహస్వామి గరుడోత్సవం

తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త


గరుడ వాహనంపై లక్ష్మీనర సింహస్వామి

తాడిపత్రి మండలం ఓబులేసుకోనలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్స వాల్లో భాగంగా బుధవారం స్వామివారి గరుడోత్స వం కన్నులపండువగా జరిగింది. ఉదయం అర్చకులు యోగానంద శర్మ స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఉత్స వ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి గరుడవాహనంపై ఆలయం చుట్టూ మేళతాళాల నడుమ అంగరంగవైభవంగా ఊరేగింపు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

**CHANGE OF SURNAME**

I KONDA Radhika (old name) W/o Kurukuru Vidya Sagar Reddy, R/o. D.No. 1-939/A, CVR Nagar, Near Rudrampeta By Pass, Near Rudrampeta New Sachivalayam, Near Legal Metrological Department, Rudrampeta, Anantapur Pin code: 515004. (A.P) hereby declare that I have changed my surname as **KURUKURU Radhika** (new name)

**DOCUMENT LOST**

I, BANDI MEKALA BALA RAMUDU, AGE 42, S/o BANDI MEKALA OBULESU DOOR NO.12/137-1,CHANDANA ROAD, YADIKI VILLAGE & MANDAL, ANANTAPUR DISTRICT. I LOST MY ORIGINAL SALE DEADS DOCUMENTS (LINKED DOCUMENT) NO.144/2010, ON 10.04.2026 AT YADIKI BUS STAND WHEN I WENT TO GET A COPY OF XEROX. IF ANYONE FOUND PLEASE CALL ME. Ph.8328085599, 9441029201

**CHANGE OF SURNAME**

I, GANDALA JANAKI (Old Surname) W/o Gandla Sivalingam R/o Door No. 9-273,Gulzar Peta, Anantapur VTC, Anantapur (D)-515001, AP, I Have changed my Surname as **GANDLA JANAKI,** Here after my New Surname known as **GANDLA JANAKI** W/o Gandla Sivalingam for all purpose.

**CHANGE OF SURNAME**

I, GANDALA SIVALINGAM (Old Surname) S/o Gandla Manikyam Late R/o Door No. 9-273, Gulzar Peta, Anantapur VTC, Anantapur (D)- 515001, AP, I Have changed my Surname as **GANDLA SIVALINGAM,** Here after my New Surname known as **GANDLA SIVALINGAM** S/o Gandla Manikyam Late for all purposes.

**డెబ్ట్స్ రికవరీ ట్రిబ్యునల్ -II ముందు**
త్రివేణి కాంప్లెక్స్, హైదరాబాద్

**O.A.No.17 of 2026**

బ్యాంక్ ఆఫ్ బరోడా,
తాడిపత్రి బ్రాంచ్, తాడిపత్రి, ప్రాతినిధ్యం వహిస్తున్న చీఫ్ మేనేజర్ ...దరఖాస్తుదారు
మరియు
మెస్సర్స్ శ్రీ అశ్వర్థ నారాయణ స్వామి ఫ్యూయల్స్ మరియు ఇతరులు ... ప్రతివాది

**పేపర్ పబ్లికేషన్ ద్వారా సమన్లు**

వీరికి,
1.మెస్సర్స్ శ్రీ అశ్వర్థ నారాయణ స్వామి ఫ్యూయల్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ శ్రీ అంబటి పెద్ది రెడ్డి, చిరునామా: సర్వే నెం.50, గూటి, వెంకటంపల్లి గ్రామం, యాడికి మండలం, అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్-515425
2. శ్రీ అంబటి పెద్ది రెడ్డి, తండ్రి: అంబటి మల్లేశ్వర రెడ్డి, చిరునామా డోర్ నెం.16-265-1, శ్రీనివాసపురం, తాడిపత్రి, అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
3. శ్రీ అంబటి మల్లేశ్వర రెడ్డి, తండ్రి: శ్రీ సుంకి రెడ్డి, చిరునామా: డి.నెం.16-265-1, శ్రీనివాసపురం,తాడిపత్రి, అనంతపురం జిల్లా, ... ప్రతివాది

మీపై రూ.39,93,183/- వసూలు కోసం దరఖాస్తుదారు దాఖలు చేసిన పై ఓ.ఏ.నెం.17/2026 లోని సమన్లను దయచేసి పరిశీలించండి. గౌరవనీయ ట్రిబ్యునల్ తెలుగు మరియు ఆంగ్ల దినపత్రికలలో పత్రికా ప్రకటన ద్వారా మీకు సమన్లు జారీ చేయాలని ఆదేశించి, ఈ విషయాన్ని 10-06-2026 కు వాయిదా వేసింది.

చట్టంలోని సెక్షన్ 19(4)లోని సబ్-సెక్షన్ (4) ప్రకారం మీరు, ప్రతివాదులు ఈ క్రింది విధంగా నిర్దేశించబడ్డారు.
(i) సమన్లు పంపిణీ చేసిన ముప్పై రోజులలోగా ప్రతిపాదించిన చర్య ఎందుకు మంజూరు చేయకూడదో చూపించడానికి;
(ii) అసలు దరఖాస్తు యొక్క క్రమ సంఖ్య 3ఎ క్రింద దరఖాస్తుదారు పేర్కొన్న ఆస్తులు మరియు ఇతర యాజమాన్యాలుకాకుండా ఇతర ఆస్తుల వివరాలను బహిర్గతం చేయడం;
(iii) అసలైన దరఖాస్తు యొక్క క్రమ సంఖ్య 3ఎ క్రింద బహిర్గతం చేయబడిన సురక్షిత ఆస్తులు లేదా అటువంటి ఇతర ఆస్తులను అమ్మకం చేయడం లేదా ఇతర క్రయ వ్యవహారాల నుండి మీరు నిరోధించబడ్డారు. ఆస్తుల జోడింపు కోసం దరఖాస్తు యొక్క విచారణ పెండింగ్‌లో ఉంది.
(iv) మీరు ఈ లోపు ఆ ఆస్తులను క్రయం ద్వారా బదిలీ చేయకూడదు. విక్రయం లేదా ఇతరత్రా తమ వ్యాపారం యొక్క సాధారణ పద్ధతి తప్ప, భద్రతా ఆసక్తిని సృష్టించిన మరియు / లేదా ఇతర ఆస్తులు మరియు ఆస్తులపై ముందస్తు అనుమతి లేకుండా అసలు దరఖాస్తు యొక్క క్రమ సంఖ్య 3ఎ క్రింద పేర్కొన్న లేదా బహిర్గతం చేయబడిన ఆస్తులు ట్రిబ్యునల్ ముందస్తు ఆమోదం.
(v) సురక్షితమైన ఆస్తులు లేదా ఇతర ఆస్తులు మరియు ఆస్తులను విక్రయించడం ద్వారా వచ్చిన అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయానికి మీరు బాధ్యత వహించాలి మరియు అటువంటి విక్రయ ఆదాయాన్ని బ్యాంకు లేదా ఆర్థిక సంస్థల వద్ద సెక్యూరిటీ వడ్డీని కలిగి ఉన్న ఖాతాలో సమ చేయాలి.

మీరు 10-06-2026 తేదీన ఉదయం 10.30 గంటలకు, డెబ్ట్స్ రికవరీ ట్రిబ్యునల్-II, 1వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్-500001 వద్ద గల ఈ ట్రిబ్యునల్ ముందు వ్యక్తిగతంగా గానీ లేదా ఒక న్యాయవాది ద్వారా గానీ హాజరై, లిఖితపూర్వక వాంగ్మూలాన్ని దాఖలు చేసి, కోరిన ఉపశమనాలను ఎందుకు మంజూరు చేయకూడదో కారణాలు చూపవలసిందిగా ఆదేశించడమైనది.

హాజరుకాని పక్షంలో, మీ గైర్హాజరీలోనే ఈ దరఖాస్తు విచారించబడి, నిర్ణయించబడుతుందని గమనించగలరు.
నా స్వహస్తములతో మరియు ఈ ట్రిబ్యునల్ యొక్క ముద్రతో తేది.27 ఏప్రియల్ 2026 న జారీ చేయబడినది.
(DRT-II, హైదరాబాద్ వారి ఆదేశానుసారం)

04ATP29_04ATP29.qxd 29-04-2026 PM 11:42 Page 1



# ధర్మవరంలో ఘనంగా శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి రథోత్సవం...!

## రథోత్సవంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్,టిడిపి ఇన్చార్జి పరిటాల శ్రీరామ్.




రథోత్సవంలో పాల్గొన్న మంత్రి సత్య కుమార్ యాదవ్,పరిటాల శ్రీరామ్

ధర్మవరం, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

ధర్మవరంలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి బ్రహ్మరథోత్సవం సందర్భంగా రాష్ట్రఆరోగ్యశాఖమంత్రి సత్య కుమార్ యాదవ్, టిడిపి ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ ఆలయాన్ని సందర్శించి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రూ. 25 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన వ్రత మండపాన్ని మంత్రి సత్య కుమార్ ప్రారంభించారు. అనంతరం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి రథోత్సవంలో పాల్గొని, సంప్రదాయబద్ధంగా మడుగు తేరును లాగి స్వామివారి రథాన్ని ముందుకు నడిపించారు. మంత్రి సత్య కుమార్ కేరళ డ్రమ్స్ వాయించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ధర్మవరం పట్టణ ప్రజలందరికీ శ్రీ చెన్నకేశవ స్వామి రథోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వామివారి కరుణా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ఈ ప్రాంత ప్రజలు సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సకాలంలో వర్షాలు కురిసి చెరువులు నిండి రైతులకు సాగునీరు సమృద్ధిగా అందాలని, పంటలు బాగా పండాలని కోరుకున్నారు.

అలాగే ధర్మవరం ప్రాంతంలో అధిక సంఖ్యలో ఉన్న చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండాలని, వారి ఆర్థిక స్థితి మెరుగుపడాలని ప్రార్థించారు. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని, వారి కుటుంబాలతో పాటు నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, ఆయురారోగ్యాలు మరియు అభివృద్ధి కోసం స్వామివారిని ప్రార్థించిన మంత్రి నియోజకవర్గ ప్రజలపై స్వామివారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని అన్నారు. ఈ రథోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో సేవలు అందించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ ఉత్సవం ధర్మవరం ప్రాంత ఆధ్యాత్మికత, సంస్కృతి మరియు ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రసాద పంపిణీ కార్యక్రమంలో మంత్రి గారు స్వయంగా వడ్డించి భక్తులకు ప్రసాదం అందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో చేనేత ప్రముఖులు సందా రాఘవ, ఆయన మిత్ర బృందం తో పాటు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు మరియు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుండుమల తిప్పేస్వామి ప్రమాణ స్వీకారం

అమరాపురం ఏప్రిల్ 29 ప్రభాతవార్త

విజయవాడలోని మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నందు మడకశిర నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి బుధవారం రెండోసారి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నందు టిడిపి జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నేత మంత్రి నారా లోకేష్ మరియు రాష్ట్ర టిడిపి నాయకుల సమక్షంలో మాజీ ఎమ్మెల్సీ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు, యువ నేత మంత్రి నారా లోకేష్ కు రాష్ట్ర నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా మంత్రి నారా లోకేష్ ను కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు .మడకశిర నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రెండవ సారి ఎంపిక కావడం పట్ల నియోజకవర్గ ంలోని తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. అదేవిధంగా ముఖ్య మంత్రి చంద్రబాబుకు, మంత్రి లోకేష్ కు, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలో ప్రభుత్వంలో భాగస్వామ్యంగా నామినేటెడ్ పదవి కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు మరియు మంత్రి నారా లోకేష్ కు విన్నవించారు. మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు చేపట్టుకున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు తోడుగా గుండుమల తిప్పేస్వామికి పదవి కేటాయిం చాలని నాయకులు కార్యకర్తలు కోరారు.



మంత్రి నారా లోకేష్ తో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి

# భక్తుల భక్తిభావంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న దేవాలయాలు

## - వైభవంగా స్వాముల వారి కళ్యాణోత్సవాలు



ప్రత్యేక అలంకణలో శ్రీ భోగేశ్వరస్వామి



ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టిడిపి ఇన్ చార్జ్ గుమ్మనూరు ఈశ్వ ర్‌ను సత్కరిస్తున్న అర్చకులు.



స్వామి వారి పునఃప్రతిష్ఠ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని సత్కరిస్తున్న భావసార క్షత్రీయులు.

పామిడి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

పట్టణంలోని శ్రీ భోగేశ్వరస్వామి, శ్రీ భావసార క్షత్రియ సమాజ్ డబ్బిదార్ ఫిర్కా రుక్మిణీ సమేత పాండురంగస్వామి దేవాలయాల్లో భక్తుల భక్తి భావంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శ్రీ భోగేశ్వరస్వామి దేవాలయం నందు వేదపారాయణం, గణపతిపూజ, పుణ్యాహావచనం, పంచగవ్యం, మార్జనలు, గర్తన్యాసం అనంతరం స్వామి వారి పున;ప్రతిష్ఠ శిఖర జీవధ్వజ యంత్రప్రతిష్ఠ నూతన శిఖర ధ్వజస్తంభ స్థాపన, శ్రీ భావసార క్షత్రీయ డబ్బిదార్ ఫిర్కా రుక్మిణీ సమేత పాండురంగస్వామి నూతన దేవాలయంలో మహాకుంభ సంప్రోక్షణ, స్వామి వారి పున;ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు హిందూ సాంప్రదాయంలో అత్యంత పవిత్రమైదని ఇది ఆలయ ఆత్మగౌరవానికి ప్రతికగా నిలుస్తుందని అర్చకులు తెలియజేశారు. భక్తిభావం అంటే భగవంతుని పట్ల గాఢమైన ప్రేమ, నిచ్చలమైన విశ్వాసం, అంకితభావంతో కూడిన పవిత్రమైన ఆధ్యాత్మిక అనుభూతి అని నిస్వార్థ సేవ, పూజ, కీర్తనల ద్వార ఆత్మను శుద్ధి చేసి మానశిక ప్రశాంతతను, మోక్షాన్ని పొందే మార్గం అన్నారు. దేవాలయాల్లో స్వాముల వారిని దర్శించుకునేందకు వేకువజాము నుండే భక్తులు పోటెత్తగా ప్రత్యేక పూజలు భక్తుల భక్తిభావంతో కిటకిటలాడాయి. స్వాముల వారిని దర్శించుకున్న భక్తులు పూజలు చేపట్టి స్వాముల వారి కృఫకు పాత్రులయ్యారు.

**స్వాముల వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు :** శ్రీ భోగేశ్వరస్వామి, శ్రీ భావసార క్షత్రియ సమాజ్ డబ్బిదార్ ఫిర్కా రుక్మిణీ సమేత పాండురంగస్వామి దేవాలయాలను వేర్వేరుగా సందర్శించిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టిడిపి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మజీ ఎంపీ తలారి రంగయ్య స్వాముల వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. దేవుని కృఫతో అందరూ క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తామని సేవా దృక్పదంతో ముందుకెళ్తే ఎల్లప్పుడూ దేవుని కృఫ మనపై ఉంటుందని వెల్లడించారు. అంతకుముందు ఆయాదేవాలయాల కమిటీ సభ్యులు వారికి స్వాగతం పలుకుతూ ఘనంగా సత్కరించారు.

# టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు స్వీకరించిన నారాలోకేష్

## శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



మంత్రి నారా లోకేష్ ను శాలు వాతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



మంత్రి నారా లోకేష్ తో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

శింగనమల ఏప్రిల్ 29 ప్రభాతవార్త

తెలుగుదేశంపార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేష్ కి తోటి ప్రజా ప్రతిని ధులతో కలిసి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేసిన శింగన మల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ నాలాంటి ఎంతో మంది యువ రాజకీయ నాయకులకు నారాలోకేష్ ఆదర్శం. ఎన్నో అడ్డంకులను అలవోకగా ఎదుర్కొన్నారు, రాజకీయ ప్రత్యర్థుల విమర్శలను చిరునవ్వుతో స్వీకరించారు. యువగళం పాదయాత్రతో కూటమి ప్రభుత్వం ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే నారాలోకేష్ నేడు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులు కావడం పార్టీ శ్రేణుల్లో, ముఖ్యంగా యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని. ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతమవుతుందని బలంగా విశ్వసిస్తున్నాను అనిఅన్నారు.

# పలు వివాహాలకు హాజరై ఎమ్మెల్యే జె.సి

## - ఆలయాల్లో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి



వధూవరులను గిఫ్ట్ అందచేస్తున్న ఎమ్మెల్యే జె.సి

తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికి మండలం నిట్టూరు గ్రామంలోని శ్రీనివాస కళ్యాణ మండపం, యాడికి పట్టణంలో చౌడేశ్వరి కళ్యాణ మండపం, తాడిపత్రి మండలం ఆంధ్ర నాంచారమ్మ కళ్యాణ మండపం, శ్రీకృష్ణదేవరాయలు కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన వివాహ వేడుకలకు ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా పెద్దపప్పూరు మండలం తిమ్మనచెరువు గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం, తాడిపత్రి మండలం ఓబులేసు కోన లక్ష్మీనరసింహస్వామి ఆలయాల వార్షికోత్సవాల సందర్భంగా ఆయా ఆలయాలను ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పెన్నహోబిళం నారసింహుని ఆలయంలో వైభవంగా 'ధ్వజారోహణం'

## - లక్ష్మినరసింహస్వామి, ఉద్భవలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
## - రాత్రి భక్తిశ్రద్ధలతో కొనసాగిన లక్ష్మినరసింహుని ప్రాకారోత్సవం



ధ్వజారోహణ పూజలు నిర్వహణలో పాల్గొ న్న ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రేగటి నాగరాజు, ఈవో సాకే రమేష్‌బాబు



లక్ష్మినరసింహుని ప్రాకారోత్సవం దృశ్యం

ఉరవకొండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

ఉరవకొండ మండల పరిధి లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో వెలసిన ప్రసిద్ధ లక్ష్మినరసిం హస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వస్తిశ్రీ పరాభవ నామ సంవత్సరం శుద్ధ త్రయోదశి బుధవారం ఆలయంలో 'ధ్వజారోహణ' కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ప్రధాన ఆలయం ముందుగల ధ్వజస్తం భానికి సాంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజారోహణం గావించారు. అనంతరం లక్ష్మినరసింహస్వా మివా రి మూలవిరాట్‌కు, కొండ క్రింద వెలసిన ఉద్భవలక్ష్మి అమ్మవారి మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు మహాభి .షేకం, అలంకరణ జరుగగా బలిహరణ, మంగళహారతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రేగటి నాగరాజు, కార్య నిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు అర్చకులు ఎ. ఎన్.ద్వారకా నాథ చా ర్యులు, యం. బాలాజీచార్, గుండు స్వామి, ధర్మకర్తల మండలి సభ్యు లు, పెద్దముష్టూరుకు చెందిన ఉత్సవ ఉభయ దాతలు తది తరులు పాల్గొన్నారు.



ఉత్సవ మూర్తు లకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకడమే ధ్వజారోహణం**

నారసింహుని ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమానికి ఎంతో ప్రాధాన్యత ఉందని చెబుతారు. ప్రతి దేశానికి ఒ క జెండా ఎలా వుంటుందో అదే తరహాలో స్వామివారికి ఒక పతాకం ఉం టుంది దాన్ని గరుడ ధ్వజం అం టారు. గరుడుకి ఒక విశిష్టమైన శక్తి ఉందని అన్ని లోకాలకు తిరిగి శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయని చెబుతాడని అందుకు గరుడుస్వామి వా రి ఆదేశాల మేరకు అష్ట దిక్పాలకులు, ముక్కోటి దేవతలను ఆహ్వానిం చ గా వారు ఉత్సవాలకు తరలివస్తారు. ధ్వజారోహణ ప్రసాదం తింటే పిల్లలు లేని వారికి సంతాన ప్రాప్తి కలుగు తుంది. బ్రహ్మోత్సవాలు జరిగే రోజుల్లో దేవాలయంకు వచ్చే వారందరికీ అన్నదానం చేస్తే ఎవ్వరికీ పూర్ణకుంభ స్వాగతం ఉండదు.



ప్రత్యేకాలంకరణలో లక్ష్మినరసింహస్వామి మూలవిరాట్

**నేత్రపర్వంగా లక్ష్మినరసింహుని ప్రాకారోత్స వం**

ఆలయ సాంప్రదాయం ప్రకారం బుధవారం రాత్రి లక్ష్మినరసింహస్వామి ప్రాకారోత్సవం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీదేవి, భూదేవి సమేత నృసింహుని ఉత్సవమూర్తులను శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీర్చి మేళతాళాల మధ్య ఉత్సవం నిర్వహించారు. మండలంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని శ్రీవారికి ప్రీతిపాత్రమైన ఆకు పూజలు నిర్వహించగా ఆలయ సాంప్రదాయం ప్రకారం మధ్యాన్నం అన్నదాన కార్యక్రమం కొనసాగింది. ఉత్సవ ఉభయ దాతలు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీలు బీఎల్‌ఏల జాబితాలు అందించాలి

## -కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఈఆర్‌వో డి.అఖిల
## -హాజరుకాని బీజేపీ, సీపీఎం, జనసేన పార్టీల ప్రతినిధులు

ఉరవకొండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్ఏ) జాబితాలను అందించాలని కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి డి.అఖిల కోరారు. పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం ఉరవకొండ-149 అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, సవరణల విషయమై చర్చించడానికిగాను రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎస్‌డీసీ డి.అఖిల మాట్లాడుతూ ఎస్ఐఆర్-2025 గురించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఎలక్షన్స్ 2002-2025 మ్యాపింగ్ గురించి వివరిస్తూ ఇప్పటి వరకు 59.58శాతం మ్యాపింగ్ పూర్తి అయిందన్నారు. ప్రతినెలా నిర్వహించే రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశానికి ఆయా పార్టీల ప్రతినిధులు హాజరై సలహాలు, సూచనలు అందించాలని కోరారు. కాగా సమావేశానికి టీడీపీ, వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్, సీపీఐ పార్టీల ప్రతినిధులు ఎం.వరప్రసాద్, ఈడిగ ప్రసాద్, సోనియా శీనా, ఎం.బి.చెన్నరాయుడు మాత్ర మే హాజరుకాగా సీపీఎం, జనసేన, బీజేపీల ప్రతినిదులు హాజరు కాలేదు. హాజరైన పార్టీ ల ప్రతినిధులు సైతం ఓటర్ల జాబితాల చేర్పులు, మార్పు లు, ఇతరత్రా అంశాలపై ఒక్క మాట కూడా మాట్లాడక పోవ దం విశేషం. ఈ కార్యక్ర మంలో ఉరవకొండ తహశీల్దార్ పాటిల్ భోగనగౌడ్, వజ్రకరూరు తహశీల్దార్ నరేష్ కుమార్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ వరప్రసా ద్, సీనియర్ సహాయకులు అశ్వర్థనారాయణ, విడపనకల్లు, బెలుగుప్ప, కూడేరు మండల తహశీల్దార్ కార్యాలయాల సిబ్బంది రాము, నాగముని, గౌతమి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి డి.అఖిల

# వైద్యశాలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించండి

## - ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

కదిరి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

.ప్రైవేట్ వైద్యశాలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం పట్ట ణంలోని గోంగూర హోటల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన స్థాయి మౌనిక ప్రైవేట్ వైద్యశాలను ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై రాబ్బన్‌కట్‌చేసి ప్రారంభించారు. వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యు లు సాయిమౌనిక, కార్యకర్తలు, నాయకులు వైద్య శాల నిర్వాహకులు రిటైర్డ్ టీచర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.



ప్రైవేట్ వైద్య శాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

# తాడిపత్రిలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల మెరుపు దాడులు

## - కుళ్లిన మాంసం, కల్తీ నూనె స్వాధీనం - శ్రీనివాస డాబాలో కాలం చెల్లిన మాంసం గుర్తింపు,
## - సరిగమ రెస్టారెంట్‌కు నోటీసులు - హోటళ్లలో హడల్ టెస్టింగ్ సాల్ట్, పాత నూనె వాడితే కఠిన చర్యలు
## - అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ దేవరాజు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు



పలుమార్లు వాడిన నూనెను పారబోయిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని హోటళ్లు, డాబాలు, టిఫిన్ బండ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. కుళ్లిన మాంసం, కాలం చెల్లిన పదార్థాలు, పలుమార్లు వాడిన నూనె వాడుతున్న హోటళ్లపై కొరడా ఝుళిపించారు. తనిఖీల్లో శ్రీనివాస డాబాలో కాలం చెల్లిన మాంసం, టెస్టింగ్ సాల్ట్, పలు మార్లు వాడిన వంట నూనెను అధికారులు గుర్తించారు. వెంటనే ఆ పదార్థాలను కింద పరవేయించి కేసు నమోదు చేశారు. సరిగమ రెస్టారెంట్‌లో వెనిగర్ బాటిళ్లపై ఎలాంటి సమాచారం, తయారీ తేదీ లేకపోవడంతో అధికారులు వాటిని సీజ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు సరిగమ రెస్టారెంట్‌కు నోటీసులు జారీ చేశారు. విద్యుత్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న బాలాజీ గోబీ సెంటర్‌లో టెస్టింగ్ సాల్ట్ వాడుతుండగా, వాసన వస్తున్న గోబీని గుర్తించారు. వెంటనే ఆ గోబీని పడవేయించి యజమానికి నోటీసులు అందజేశారు. యల్లనూరు రోడ్డులోని పిఎన్ఆర్ కిచెన్స్ లో తనిఖీలు చేపట్టగా శుభ్రత లేకపోవడం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో ఆ రెస్టారెంట్‌కు నోటీసులు ఇచ్చారు. బస్టాండ్ వద్ద రేకుల షెడ్లలో ఉన్న టిఫిన్ బండ్ల యజమానులకు టెస్టింగ్ సాల్ట్స్, కలర్స్ వాడకూడదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. 'ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదని, కల్తీ ఆహారం విక్రయించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, హోటళ్ల ఫుడ్ సేఫ్టీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ దేవరాజు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీమా బేగం, మున్సిపల్ ఏఈ నాగేంద్ర, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దినేష్‌కుమార్‌రెడ్డి, సెక్రెటరీ రాఘవేంద్ర, రంగస్వామి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.